
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు

సోమవారం 8 సెప్టెంబరు 2025



5 నూతన పాలసీతో బార్లు లాభదాయకం ● ఎక్సైజ్ డీసీ శ్రీనివాసులు

14 క్రస్ట్‌గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల

6 వీడిన మహిళ హత్య కేసు మిస్టరీ

గ్రహణంతో ఆలయాల మూత

గ్రహణశుద్ధి అనంతరం నేటి ఉదయం నుంచి దర్శనాలు



అమరావతి : మూతపడిన అమరేశ్వరస్వామి దేవస్థాన రాజగోపురం తలుపులు

కోటప్పకొండ(నరసరావుపేట రూరల్), అమరావతి, పెదకాకాని, తెనాలి అర్బన్, మంగళగిరి సిటీ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా జిల్లాలోని ప్రధాన ఆలయాలతోపాటు స్థానికంగా ఉన్న ఆలయాలను మూసేశారు. స్వామి అమ్మవార్లకు నివేదన అనంతరం ఆదివారం మధ్యాహ్నం అర్చకులు, ఆలయ సిబ్బంది, అ ధికారుల సమక్షంలో ఆలయాల గర్భాలయా లతో పాటు ప్రధాన ద్వారా లకు తాళాలు వేశారు. పెదకాకానిలోని మల్లేశ్వర స్వా మి దేవస్థానం, తెనాలి వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం, మంగళగిరిలోని లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానం ఎగువ, దిగువ సన్నిధులతోపాటు ఉపాలయాలకు అర్చక స్వాములు కవాట బంధనం చేశారు. గ్రహ ణం విడిచాక శుద్ధి, పుణ్యాహవచనం చేసి నిత్యసేవలను ఏకాంతంగా నిర్వహిస్తారు. సో మవారం ఉదయం నుంచి స్వామి, అమ్మవార్ల దర్శనాలకు భక్తులను అనుమతి స్తామని అర్చకులు, అధికారులు ప్రకటించారు.

● ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండలోని త్రికోటేశ్వరస్వామి వారికి సోమవారం ఉదయం 9 గంటల నుంచి నిత్య అభిషేకాలు, కైంకర్యాలు యథావిధిగా జరుగుతాయని ఆలయ కార్యనిర్వహణ అధికారి చంద్రశేఖర్ తెలిపారు.

● అమరావతిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బా లచాముండికా సమేత అమరేశ్వర స్వామి ఆలయంలో సంప్రోక్షణ అనంతరం సోమవారం ఉదయం 8 గంటలకు స్వామివారి దర్శనానికి భక్తులను అనుమతించనున్నారు.



తెనాలి : వైకుంఠపురం గర్భాలయాన్ని మూసివేస్తున్న అర్చకులు



నరసరావుపేట : కోటప్పకొండ ఆలయం..



పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థాన ప్రధాన ద్వారానికి తాళాలు వేస్తున్న అర్చకులు



మంగళగిరి నృసింహస్వామి దేవస్థానంలో గర్భాలయం ద్వారాన్ని మూసివేసిన అర్చకులు



గుంటూరులో సంపూర్ణ చంద్రగ్రహణ దృశ్యాలు

డిజిటల్ అరెస్టు.. రూ.62 లక్షలు కొట్టేశారు

● మనీలాండరింగ్ కేసుని సైబర్ మోసగాళ్ల బెదిరింపు

గుంటూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ అరెస్టు అంటూ సైబర్ నేరగాళ్లు ఓ బాధితుడ్ని బెదిరించిన ఫిర్యాదుపై అరండల్‌పేట పోలీస్‌స్టేషన్లో సైబర్ క్రైమ్ కేసు నమోదైంది. మనీలాండరింగ్ కేసులో నిందితులతో కలిసి లావాదేవీలు నిర్వహించారు.. మిమ్మల్ని అరెస్టు చేయాల్సి ఉంటుందని బెదిరించి దశలవారీగా రూ.62 లక్షలకు పైగా మోసం చేశారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు.. గుంటూరులోని భారత్‌పేట ప్రాంతానికి చెందిన కన్‌స్ట్రక్షన్ వ్యాపారం చేసే ఓ వ్యక్తికి ఇటీవల కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఉత్తర్‌ప్రదేశ్ పోలీసు, టెలికాం డిపార్ట్‌మెంట్, సీబీఐ నుంచి మాట్లాడుతున్నామని వాట్సాప్ వీడియో కాల్స్ చేశారు. తాము మనీలాండరింగ్ కేసులో ఓ వ్యక్తిని అరెస్టు చేయగా అతడి వద్ద మీ వివరాలు దొరికినట్లుగా భారత్‌పేట ప్రాంతానికి చెందిన వ్యక్తికి చెప్పారు. నగదు లావాదేవీలు జరిగినట్లుగా ఆధారాలు ఉన్నాయని మిమ్మల్ని అరెస్టు చేస్తామని బెదిరించారు. అరెస్టు చేయకుండా ఉండాలన్నా, కేసులో క్లియరెన్స్ ఇవ్వాలన్నా నగదు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇలా పలు దఫాలుగా మొత్తం 62 లక్షల 25 వేల రూపాయలు వసూలు చేశారు. బాధితుడు ఇంటి దస్తావేజులు తాకట్టు పెట్టి రుణాలు తీసుకుని వారు చెప్పిన ఖాతాలకు ఆర్‌టీజీఎస్ ద్వారా నగదు బదిలీ చేశారు. అయినా ఇంకా సదరు వ్యక్తులు డిజిటల్ అరెస్టు పేరుతో ఇంకా ఫోన్లు చేస్తూ బెదిరిస్తుండటంతో బాధితుడు పోలీసులను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అరండల్‌పేట ఎస్ఐ కృష్ణబాజీ తెలిపారు.

వెంకన్న వైభోగం

● రూ.107 కోట్లతో టీటీడీ ఆలయ విస్తరణ
● మూడు ప్యాకేజీలుగా పనులకు టెండర్లు
● మలిదశలో రూ.50 కోట్లతో మౌలిక సదుపాయాలు



మాస్టర్‌ప్లాన్ ప్రకారం వెంకటపాలెంలో శ్రీనివాసుని ఆలయ సుందర దృశ్యం

(ఆంధ్రజ్యోతి, మంగళగిరి)

ఏపీ రాజధాని అమరావతిలో వెంకన్న వైభోగం పరిఢవిల్లనున్నది. అమరావతిలో తిరుమలను సాక్షాత్కరింపజేయాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్ష నెరవేరనున్నది. ఈ దిశగా వెంకటపాలెంలో ఆలయాభివృద్ధికి టీటీడీ చర్యలు తీసుకుంటోంది. గత టీడీపీ ప్రభుత్వం 25 ఎకరాల విస్తీర్ణంలో రూ.150 కోట్లతో దివ్యమందిర నిర్మాణానికి 2019 ఫిబ్రవరిలో ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారు. అయితే వైసీపీ ప్రభుత్వం దానికి తూట్లు పొడిచి కేవలం రూ.30 కోట్లతో మమ అనిపించేలా ఆలయాన్ని నిర్మింపచేసింది. ఈ క్రమంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వెంకన్న ఆలయ నిర్మాణాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఏడేళ్ల క్రితం అనుకున్నదానికన్నా మిన్నగా మరింత అద్భుతంగా ఆలయ విస్తరణ పనులకు శ్రీకారం చుట్టింది. రూ.185 కోట్లతో ఆలయ విస్తరణ పనులను చేపడతామని గత మార్చిలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఆలయాభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ కోసం డీపీఆర్ తయారుచేయించి ఆ ప్రకారం విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతానికి రూ.107.54 కోట్లతో వెంకటపాలెంలో వెంకన్న ఆలయ విస్తరణ పనులను చేపడుతున్నారు. ఈ పనులకు సంబంధించి మూడు వేర్వేరు టెండర్లను టీటీడీ తాజాగా పిలిచింది. త్వరలో యాత్రికుల సౌకర్యార్థం రూ.50 కోట్లకు పైగా వ్యయంతో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కూడా టీటీడీ సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ఇందులో అన్నదాన భవనం, అర్చకులు, సిబ్బంది నివాసగృహాలు, భక్తుల కోసం

(మిగతా 6లో)

ప్యాకేజీలు.. పనులు

తొలి ప్యాకేజీ: రూ.36.99 కోట్లతో ఏడంతస్తుల మహా రాజగోపురం, అద్దాల మండపం, ఆర్జిత సేవా మండపం, వాహనశాల, రాథ మండపం, ఆంజనేయస్వామి మందిరం, కల్యాణ పుష్కరిణి, లోపలి, వెలుపలి ప్రాకారాలలో ఫ్లోరింగ్ పనులను చేపడతారు.

రెండో ప్యారేజీ: రూ.35.20 కోట్లతో దక్షిణప్రాంత మాడవీధి, అప్రోచ్ రోడ్లు, ఉత్సవ, కల్యాణోత్సవ మండపాలు, వెలుపలి దక్షిణ ప్రాకారం, ఐదంతస్తుల గోపుర నిర్మాణాలను చేపడతారు.

మూడో ప్యాకేజీ: రూ.35.35 కోట్లతో వెలుపలి ఉత్తర ప్రాకారం, మరో ఉత్సవ మండపం, ఉత్తరం వైపు మాడవీధి, రెండు గోపుర నిర్మాణాలను(ఐదంతస్తులు) చేపడతారు.

ములుకుదురుకు మోక్షమెప్పుడు?

ఐదేళ్లుగా అసంపూర్తిగా ఎత్తిపోతల పథకం



అసంపూర్తిగా ఉన్న ఎత్తిపోతల పథకం పంపు హౌస్



పిచ్చిచెట్ల మధ్య ఉన్న మోటార్లు

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ములుకుదురు ఎత్తిపోతల పథకం పూర్తికి ఏళ్లుగా రైతులు ఎదురుచూస్తున్నా ఫలితం కనిపించడంలేదు. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిగా ఇప్పుడూ అదే కొనసాగుతోంది. శ్రీరంగపురం ఛానల్ పూడిక పేరుకుపోవడం, పట్టణంలో ఆక్రమణలతో కాల్వ చివరి భూమిగా మండలంలో ములుకుదురు గ్రామ వ్యవసాయ భూములకు చుక్క నీరు రాని పరిస్థితి ఏర్పడింది. దీంతో చింతలపూడి, మాచవరం, ములుకుదురు గ్రామాల్లో రైతులు సాగునీటికి తీవ్రంగా ఇక్కట్లు పడుతున్నారు. ములుకుదురు నుంచి తుంగభద్ర, కొల్లిమర్ల డ్రెయిన్లు ప్రవహిస్తున్నా సాగు నీరు అందని పరిస్థితి. ఈ క్రమంలో రైతులు కాల్వలపై ఇంజన్లు ఏర్పాటు చేసుకొని నీటిని తోడుకుని పంటలు సాగు చేసుకునే దుస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ కొల్లిమర్ల డ్రెయిన్‌పై మైక్రోఇరిగేషన్ శాఖ ద్వారా ఎత్తిపోతల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. నాబార్డ్ నిధులు రూ.3.77 కోట్లతో ఎత్తిపోతల నిర్మాణాన్ని 2018 మేలో ప్రారంభించారు. 2020 నాటికి ఈ పథకం పూర్తయి రైతులకు సాగునీరు అందించాలి. 70 శాతం పనులు పూర్తి అయ్యాయి. ఇంతలో వైసీపీ అధికారంలోకి రావడంతోనే ఎత్తిపోతలకు గ్రహణం పట్టింది. మిగిలిన పనులు పూర్తి చేయాల్సిన పాలకులు నిలిపివేయించారు. పాలకుల, అధికారుల నిర్వాకంతో ఎత్తిపోతల పథకం ఆరేళ్లుగా అసంపూర్తిగా మిగిలింది. నిర్మాణం పూర్తి కాకపోవడంతో రైతులకు సాగునీరు కోసం దిక్కులు చూడాల్సిన దుస్థితి ఏర్పడింది. భారీ విద్యుత్ మోటార్లు నిర్వహణా లోపంతో చెట్ల మధ్య నిరుపయోగంగా ఉన్నాయి. రైతుల వినతి మేరకు పనులకు నిధులు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే నరేంద్ర ప్రకటించారు. దీంతో రైతుల్లో ఆశలు మళ్లీ చిగురిస్తున్నాయి.



12

తురకపాలెం మిస్టరీ వీడుతోంది!

» జీజీహెచ్ రోగుల్లో సూడోమల్లీ బ్యాక్టీరియా గుర్తింపు
» మెలియోయిడోసిస్‌గా నిర్ధారణ.. నేడు ప్రకటించే అవకాశం

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. మండల, డివిజన్ స్థాయిలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యాలయాలకు రాని వారు తమ అర్జీలను 'మీకోసం. ఎపి.జీవోవి. ఇన్' అనే వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అర్జీలు అందజేసిన తర్వాత వాటి స్థితిని తెలుసుకునేందుకు 1100 అనే నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వైద్యపరికరాలకు.. రూ.23.51 కోట్లు

జీజీహెచ్‌లో ఎంసీహెచ్ బ్లాక్‌కు నిధులు

త్వరలో అందుబాటులోకి రానున్న మాతా శిశు ఆరోగ్య సంరక్షణ విభాగం

గుంటూరు మెడికల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గుంటూరు వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం, ఉత్తర అమెరికా (జింకానా) వితరణతో రూ.86 కోట్లతో జీజీహెచ్‌లో చేపట్టిన మాతా శిశు ఆరోగ్య సంరక్షణ విభాగం(ఎంసీహెచ్ బ్లాక్) ఈ ఏడాది డిసెంబరులో నిర్మాణ పనులు పూర్తి చేసుకోనున్నది. తల్లీ, బిడ్డల ఆరోగ్య సంరక్షణకు 600 పడకలతో రూపుదిద్దుకుంటున్న ఈ ఆధునిక విభాగాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఎంసీహెచ్ బ్లాక్‌లో అవసరమైన వైద్య పరికరాలను అందించాలని జింకానా ప్రతినిధులు గతంలో రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. దీనిపై స్పందించిన ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ రూ.23.51 కోట్లతో నూతన వైద్య పరికాలు కొనుగోలు చేసి ఎంసీహెచ్ బ్లాక్‌కు పంపేందుకు ఆమోదం తెలిపారు. ఇందులో ఆధునిక పడకలు, ఐసీయూ బెడ్లు, మొబైల్ ఎక్స్‌రే యూనిట్లు, మొబైల్ అల్ట్రాసౌండ్ మెషిన్లు, నెబ్యులైజర్లు, డెలివరీ సెట్లు, ఆక్సీమీటర్లు, పేషెంట్ మానిటర్లు, వెంటిలేటర్లు, డీఫిబ్రిలేటర్లు, ఈసీజీ మెషిన్లు, ఫొటోథెరపీ యూనిట్లు, సర్జికల్ చైర్లు వంటి 37 రకాలకు చెందిన 1187 పరికరాలు ఉన్నాయి.



డ్వాక్రాలకు.. డ్రోన్లు

● సాగులో సంఘాల భాగస్వామ్యం ● నమోదీదీ పథకం ద్వారా ప్రోత్సాహం ● రాయితీపై డ్రోన్లు అందించనున్న ప్రభుత్వం ● మహిళలకు ఆదాయం పెంచే దిశగా చర్యలు ● తొలి దశలో మూడు జిల్లాల్లో 200 వరకు ఆమోదం ● మండలానికి రెండు సంఘాలకు అందించేలా కార్యాచరణ

(తెనాలి, ఆంధ్రజ్యోతి)

సాగు.. సాంకేతికతను సంతరించుకుంటోంది. సంప్రదాయ వ్యవసాయ విధానాన్ని యంత్రాల వినియోగంతో ఆధునిక వ్యవసాయం అధిగమించింది. కూలీల కొరత.. కూలి భారాల్ని తగ్గిస్తూ కొత్త పుంతలు తొక్కుతోంది. ఈ క్రమంలో వ్యవసాయంలో డ్రోన్ల వాడకాన్ని విరివిగా పెంచడానికి ఇప్పటికే ప్రభుత్వం పక్కా ప్రణాళికతో అడుగులేస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఇప్పటికే గ్రామాల్లో రైతు గ్రూపులకు రాయితీపై డ్రోన్లు పంపిణీ చేపట్టింది. వీటిని మరింతగా ముందుకు తీసుకెళ్లేందుకు కేంద్రం సరికొత్త పథకానికి శ్రీకారం చుట్టగా ఇందులో రాష్ట్రం కూడా ఇతోధికంగా సాయం అందించనుంది. యాంత్రీకరణను ప్రోత్సహించడంతో పాటు ఇందులో డ్వాక్రా సంఘాలకు కూడా భాగస్వామ్యం కల్పించాలనే ఉద్దేశంతో కేంద్రం నమోదీదీ పథకానికి అంకురార్పణ చేసింది. డ్వాక్రా సంఘాలకు కానీ వ్యక్తిగతంగా మహిళలకు రాయితీపై డ్రోన్లు అందించి వారి ఆదాయ మార్గాలను మెరుగుపరచాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. ఇందుకు సంబంధించి డ్వాక్రా సంఘాలను దరఖాస్తులు ఆహ్వానించే ప్రక్రియ రెండు నెలల క్రితమే డీఆర్‌డీఏ మొదలు పెట్టింది. తొలి దశలో భాగంగా మండలానికి కనీసం రెండు సంఘాలకు డ్రోన్లు అందించేలా కార్యాచరణ రూపొందించింది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో దాదాపు 400 దరఖాస్తులు రాయితీ డ్రోన్ల కోసం డ్వాక్రా సంఘాల మహి ళల నుంచి రాగా నిబంధనల ప్రకారం 200 మంది అర్హత సాధించారు. వీరందరికీ త్వరలోనే రాయితీపై డ్రోన్లు

(మిగతా 6లో)

80 శాతం రాయితీ.. రూ.2 కోట్ల లబ్ధి

రాయితీపై అందించే ఒక్కో డ్రోన్ వ్యయం దాదాపు రూ.10.50 లక్షలు కాగా ఇందులో 80 శాతం రాయితీ నమోదీదీ పథకం ద్వారా డ్వాక్రా సంఘాలకు అందనుంది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో 200 డ్రోన్లను తొలి దశలో అందించడానికి కసరత్తు చేస్తున్నారు. రాయితీ ద్వారా డ్వాక్రా సంఘాలకు రూ.2 కోట్ల వరకు లబ్ధి అందనుంది. రెండేళ్ల వ్యవధిలో మూడు జిల్లాల పరిధిలో కనీసం 10,000 డ్వాక్రా సంఘాలను నమోదీదీ పథకం రాయితీ ఫలాలు అందనున్నాయి. ఈ మేరకు డీఆర్‌డీఏకు ఆదేశాలు అందినట్లు సమాచారం.

పింఛను కోసం వచ్చి..ప్రాణాలు కోల్పోయింది

● వీడిన హత్య కేసు మిస్టరీ

గురజాలటౌన్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): దాచేపల్లి మండలం గారాలపాడు గ్రామంలో ఈ నెల 1న జరిగిన మహిళ హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. హత్యకు సంబంధించిన కేసు వివరాలను ఆదివారం గురజాల డీఎస్పీ జగదీష్ విలేకరులకు వెల్లడించారు. మృతురాలు దాచర్ల పూర్ణమ్మ పింఛన్ తీసుకునేందుకు గత నెల 31న గుంటూరు నుంచి పెదగార్లపాడులోని తమ్ముడు ఇంటికి వచ్చింది. ఆమె తమ్ముడు వినుకొండ లచ్చయ్య గొర్రెలు అమ్మి రూ. 4.50 లక్షలు దాచి ఉంచాడు. అయితే వాటిలో రూ.లక్ష కనిపించలేదు. ఆ డబ్బు పూర్ణమ్మ తీసిందనే అనుమానంతో మరుసటి రోజు మధ్యాహ్నం ఆమెతో వాగ్వివాదానికి దిగాడు. ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగింది. మంచం కోడుతో లచ్చయ్య దాడి చేయడంతో పూర్ణమ్మ అక్కడికక్కడే మృతిచెందింది. మంచం కోడును డాబాపై విసిరి లచ్చయ్య వెళ్లిపోయాడు. స్థానికుల సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేశారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంను రంగంలోకి దింపారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జగదీష్

నిందితుడు లచ్చయ్యను అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించాడు. హత్య కేసు దర్యాప్తులో సమర్థంగా వ్యవహరించిన దాచేపల్లి సీఐ భాస్కర్, ఎస్ఐలు పాపారావు, సౌందర్య రాజన్‌ను డీఎస్పీ జగదీష్ అభినందించారు.

20 లక్షల ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం అడుగులు

● ఎమ్మెల్సీ ఆలపాటి

గుంటూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం 20 లక్షల ఉద్యోగాల కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేస్తోందని, అందులో భాగంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తోందని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. గుంటూరు ఏన్‌జీఓ హోంలో ఆదివారం ఆయన నేతృత్వంలో నైపుణ్య శిక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో మాజీ ఎమ్మెల్సీలు ఏఎస్ రామకృష్ణ, పరుచూరి అశోక్ బాబు పాల్గొన్నారు. ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణపై సెప్టెంబర్ 21న మరో సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలపై దృష్టి పెట్టి.. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడమే ప్రధాన లక్ష్యమన్నారు. 30 ఏళ్లలోపు యువత ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని సూచించారు. 228 మందికి పైగా ఈ రోజు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. ఉద్యోగ నోటిఫికేషన్ల గురించి విజయ సాధన కోచింగ్ నిర్వాహకులు కిషోర్, రాజు ఆహూతులకు వివరించారు. సదస్సుకు ఎన్నారై విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిడికిటి తిలక్‌బాబు అధ్యక్షత వహించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాదు

నీటి కాలుష్యం వల్లే వరుస మరణాలు

తురక పాలెంలో.. ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం నిజ నిర్ధారణ కమిటీ పర్యటన

గుంటూరు సిటీ, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): గుంటూరు సమీపంలోని తురకపాలెంలో నీటి కాలుష్యం వల్లే వరస మరణాలు సంభవించాయని ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం వెల్లడించింది. ఆదివారం తురకపాలెం గ్రామాన్ని సంఘం నిజనిర్ధారణ కమిటీ సందర్శించింది. కమిటీ సభ్యులు వరస మరణాలు సంభవించిన ఎస్సీ కాలనీ వాసులతో మాట్లాడారు. కొద్ది రోజుల నుంచి ఎస్సీ కాలనీకి తిప్పకుంట చెరువు నుంచి నీటిని సరఫరా చేస్తున్నట్లు బాధితులు వెల్లడించారు. చాలాకాలంగా పాడుబడి ఉన్న ఆ చెరువు నీళ్లు తాగటం వల్లే భయంకరమైన బ్యాక్టీరియా బారిన కాలనీ వాసులు పడినట్లుగా పౌర హక్కుల సంఘం నాయకులు గుర్తించారు. గ్రామంలో ప్రైవేట్ వ్యక్తులు బోర్లు వేసుకొని నీటిని అమ్ముకుంటున్నారని, తద్వారా భూగర్భ జలమట్టం పడిపోయి గ్రామ పంచాయతీకి చెందిన బోర్లు ఎండిపోయాయని నిజ నిర్ధారణ కమిటీ వెల్లడించింది. ఈ మరణాలకు కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవడంతో పాటుగా, మరణించిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 25లక్షల నష్ట పరిహారం అందజేయాలని పౌర హక్కుల సంఘం నేతలు డిమాండ్ చేశారు. గ్రామాన్ని ఎస్సీ, ఎస్టీ కమిషన్ సందర్శించాలని విజ్ఞప్తి చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిట్టిబాబు, ప్రధాన కార్యదర్శి చిలకా చంద్రశేఖర్, కోశాధికారి డాక్టర్ టి.రాజారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు రాజారావు, జిల్లా కార్యదర్శి సి.కోటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వీరేశ లింగం, జిల్లా ఉపాధ్యక్షుడు ప్రభాకర్, జాయింట్ సెక్రటరీ గోపీనాథ్, ఎస్కే. నాగూర్ వలి ఉన్నారు.


చెరువును పరిశీలిస్తున్న సంఘం నేతలు

విశ్వనాథ సాహిత్యం నేటి యువతకు ప్రేరణ కావాలి

●వీవీఐటీ వర్సిటీ వీసీ వాసిరెడ్డి విద్యాసాగర్

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): విశ్వనాథ సత్యనారాయణ సాహిత్యంలో తరచూ కనపడే సగటు జీవి వేదన వర్తమాన యువ సాహితీవేత్తలకు ఒక దిక్సూచి, ప్రేరణ కాగలదని వీవీఐటీ యూనివర్సిటీ వీసీ వాసిరెడ్డి విద్యాసాగర్ పేర్కొన్నారు. వర్సిటీ, విశ్వనాథ సాహిత్య అకాడమీ సంయుక్త ఆధ్వర్యాన.. స్థానిక లక్ష్మీపురం శ్రీత్యాగరాజ సాంస్కృతిక సంఘం సమావేశ మందిరంలో ఆదివారం విశ్వనాథ పదంలో యువత దృక్పథం పత్ర సమర్పణ సదస్సు నిర్వహించారు. ప్రారంభ సదస్సుకు డాక్టర్ మద్దినేని సింహ కౌటిల్య చౌదరి అధ్యక్షత వహించి ఆధునిక తెలుగు సాహిత్యం పునరుజ్జీవానికి కవి సామ్రాట్ సత్యనారాయణ తనదైన శైలిలో బాటలు వేశారన్నారు. చారిత్రక నవలల సదస్సుకు డాక్టర్ అబ్బరాజు మైథిలి అధ్యక్షత వహించగా.. కడిమి చెట్టు నవలపై చీదెళ్ళ వీహెచ్ సూర్యకిరణ్, వీరపూజ నవలపై మాడుగుల ఎన్వీ సుబ్రహ్మణ్య శర్మ, చందవోలు రాణి నవలపై పాతూరి శ్రీ ప్రవణ్ చర్చించారు. సాంఘిక నవలల సదస్సుకు వీబీ హేలి కల్యాణ్ అధ్యక్షత వహించగా.. నీలపెళ్లి పంతుల వీఎన్ఎస్ హరిప్రియ, పరీక్ష నవలపై కురుగంటి చిరంజీవి కార్తీక్, కుణాలుని శాపము నవలపై కనకాల రవికుమార్ విశ్లేషించారు. ముగింపు సభకు విశ్వనాథ సాహిత్య అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ మద్దినేని సింహ కౌటిల్య చౌదరి అధ్యక్షత వహించగా.. ముఖ్య అతిథిగా పాల్గొన్న వాసిరెడ్డి విద్యాసాగర్ విశ్వనాథ పథంలో యువత గ్రంథావిష్కరణ గావించారు. ఈ కార్యక్రమంలో అతిథులుగా విశ్వనాథ సత్యనారాయణ మనుమడు విశ్వనాథ సత్యనారాయణ, విశ్వనాథ సాహిత్య అకాడమీ సభ్యులు పిన్నమనేని మృత్యుంజయరావు. రావెల సాంబశివరావు, మోదుగుల రవికృష్ణ, కోశాధికారి డాక్టర్ సెట్లం చంద్రమోహన్, పలువురు సాహితీవేత్తలు, కవులు, యువ రచయితలు తదితరులు పాల్గొన్నారు.


గ్రంథావిష్కరణ చేస్తున్న వాసిరెడ్డి విద్యాసాగర్

నూతన పాలసీతో బార్లు లాభదాయకం

● ఎక్సైజ్ డీసీ కె.శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): నూతన బార్ పాలసీపై కొంతమంది స్వార్థంతో, కొత్తవాళ్లు ఈ వ్యాపారంలోకి రాకుండా అడ్డుకునేందుకు చెడు ప్రచారం చేస్తున్నారని.. వాటిని నమ్మవద్దని ఎక్సైజ్ శాఖ గుంటూరు డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె.శ్రీనివాసులు కోరారు. ఆదివారం నగరంలోని కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. గుంటూరు జిల్లాలో 53 మంది, పల్నాడు జిల్లాలో 24 మంది బార్ లైసెన్సులు తీసుకొని చక్కగా వ్యాపారం చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుత బారు పాలసీలో చాలా సడలింపులు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. లైసెన్సు ఫీజును ఒకేసారి కాకుండా ఆరు వాయిదాల్లో చెల్లించవచ్చన్నారు. అప్లికేషన్ ఫీజు రూ.10 లక్షల నుంచి రూ.5 లక్షలు తగ్గించినట్లు చెప్పారు. ఒక వ్యక్తి ఎన్ని అప్లికేషన్లు అయినా వేయొచ్చన్నారు. గుంటూరు, మంగళగిరి - తాడేపల్లి మునిసిపల్ కార్పొరేషన్ల పరిధి, వాటికి అవతల 10 కిలోమీటర్ల వరకు ఎక్కడైనా బార్లు నడుపుకోవచ్చని డీసీ స్పష్టం చేశారు. బార్ లైసెన్సు పొందిన తర్వాత 15 రోజుల్లోపు బార్ ప్రెమిసెస్ చూపించి రెస్టారెంట్ లైసెన్సు తీసుకోవచ్చన్నారు. నూతన బార్ వ్యాపార వేళలు ఉదయం 10 నుంచి రాత్రి 12 గంటల వరకు పెంచారన్నారు. ప్రస్తుతం గుంటూరులో మద్యం షాపు లైసెన్సు ఫీజు కోటీ లక్ష రూపాయలు అని, అదే బారు అయితే రూ.75 లక్షలు మాత్రమే అని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్, ఎన్‌రోల్‌మెంట్ తదితర సమాచారం కోసం ప్రొహిబిషన్ ఎక్సైజ్‌శాఖ అధికారిని సంప్రదించవచ్చన్నారు. జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి అరుణ కుమారి, ఏఈఎస్ మారయ్య బాబుపాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీసీ కె.శ్రీనివాసులు పక్కన అరుణ కుమారి, మారయ్యబాబు

14 క్రస్ట్‌గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల

విజయపురిసౌత్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి వరద నీరు అధికంగా నాగార్జున సాగర్‌కు చేరుతోంది. దీంతో 14 క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 1,12,966 క్యూసెక్కుల నీటిని దిగువకు అధికారులు విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నీటిమట్టం ఆదివారం నాటికి 589.70 అడుగులు ఉంది. ఇది 311.14 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9,500, ఎడమ కాలువ ద్వారా 8,454, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,373, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2,400, ఎల్ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో 1,66,993 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి ఇన్‌ఫ్లో 1,66,993 క్యూసెక్కులుగా ఉంది.


14 క్రస్ట్ గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

ఎత్తిపోతల పథకం పైపులు ధ్వంసం

చిలకలూరిపేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పసుమర్రు గ్రామ ఎత్తిపోతల పథకం - 1కి సంబంధించిన పైపు లైన్‌ను గుర్తుతెలియని వ్యక్తులు శనివారం రాత్రి ధ్వంసం చేశారు. ఐదు అడుగుల పొడవు ఉండే 16 పైపులను పొక్లెయినర్‌తో తవ్వేశారు. కొంతకాలంగా ఈ లిఫ్ట్ మూలనపడి ఉంది. ఎత్తిపోతల పథకం కమిటీ అధ్యక్షుడు జి. రవితేజ చిలకలూరిపేట రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆ సమయంలో అక్కడ ఉన్న పొక్లెయినర్, ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు విచారణ చేస్తున్నారు. ఎత్తిపోతల పథకం కింద 2,700 ఎకరాల ఆయకట్టు ఉంది. ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డీఈకి సమాచారం అందించారు.


ధ్వంసమైన పైపులు

అన్ని హామీలు నెరవేరుస్తున్నాం

● ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

చేబ్రోలు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలన్నీ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. మండలంలోని వేజెండ్ల గ్రామంలో వైసీపీ ఎంపీటీసీ, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు కాసు అనితారెడ్డి, వేజెండ్ల సొసైటీ మాజీ అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి ఆయన అనుచరులు ఆదివారం టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నరేంద్రకుమార్ మాట్లాడుతూ.. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా వేజండ్ల పరిధిలో ఉన్న క్వారీలను మంచి నీటి చెరువులుగా మార్చేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదన పంపామన్నారు. కూటమి ప్రభుత్వం గ్రామంలో కోటి రూపాయల అభివృద్ధి పనులు చేపట్టిందన్నారు. గ్రామంలో ఎప్పటి నుంచో నెలకొన్న ఈద్గా సమస్యను వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా కాసు ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అభివృద్ధిని చూసి ఆకర్షితులమై.. టీడీపీలో చేరడం జరిగిందన్నారు. పార్టీలో ఎటువంటి పదవులను ఆశించడం లేదన్నారు. అనితా రెడ్డి మాట్లాడుతూ వైసీపీలో ఉపాధ్యక్షురాలిగా తన గ్రామాన్ని అభివృద్ధి చేసుకోలేక పోయానని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ 14వ వార్డు మెంబర్ వేజండ్ల శశికుమార్, పలువురు బూత్ కన్వీనర్లు, కార్యకర్తలకు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఎమ్మెల్యే ధూళిపాళ్ల ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో చేబ్రోలు, పెదకాకాని మండలాల పార్టీ అధ్యక్షులు మైలా రామరాజు, మురళి, శుద్ధపల్లి ఎంపీటీసీ వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు వీరంకి రంగారావు, మాజీ ఎంపీపీ ఖాదర్ బాషా పాల్గొన్నారు.


టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలతో ఎమ్మెల్యే ధూళిపాళ్ల

దాతల సహకారాన్ని అందిపుచ్చుకోవాలి

● బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్


ఉపకార వేతనాలు పొందిన విదార్థులతో రాంప్రసాదు తదితరులు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): దాతల సహకారాన్ని అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని విద్యార్థులకు బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాదు సూచించారు. స్థానిక బ్రాడీపేటలోని బ్రాహ్మణ సేవా సమితి ప్రాంగణంలో ఆదివారం 2025-26 విద్యా పారితోషిక ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి సమితి అధ్యక్షుడు నందిరాజు పాండురంగారావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి రాంప్రసాదు మాట్లాడుతూ.. సామాజిక దృక్పథంతో ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి విద్యను ప్రోత్సహించాలన్నారు. బ్రాహ్మణ సేవా సమితి కార్యక్రమాలను అభినందించారు. పాండురంగారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాగా చదువుకొని ఉన్నత స్థానం పొందిన తర్వాత సమితికి అండగా నిలబడాలని కోరారు. ఇంజనీరింగ్, మెడిసిన్ అభ్యసిస్తున్న 252 మంది విద్యార్థులకు రూ.21,50,000 ఉపకార వేతనాలను అందజేశారు. సమితి కార్యదర్శి లక్ష్మీపతి, విద్యా పారితోషకాల చైర్మన్ సంజీవరావు, సభ్యులు బాలకృష్ణ, తుళ్లూరు ప్రకాష్, మాదల వెంకటకృష్ణ, ఆదిరాజు శ్రీధర్, బొప్పూడి కృష్ణ ప్రసాదు, పాతూరు శ్రీనాథ్, రామారావు పాల్గొన్నారు.

డ్వాక్రాలకు.. డ్రోన్లు

(5వ పేజీ తరువాయి)

అందించడానికి డీఆర్‌డీఏ కసరత్తు చేస్తోంది. మొదటి దశలో భాగంగా ఇచ్చే ఈ డ్రోన్లను ఈ నెలాఖరుకు జిల్లాలకు చేరనున్నాయి. దశల వారీగా ప్రతి డ్వాక్రా సంఘానికి రాయితీపై డ్రోన్లు అందించాలనేది ప్రభుత్వ లక్ష్యం. సాధారణంగా గ్రామాల్లో మహిళలు పురుషులతో సమానంగా సేద్యంలో కష్టపడుతూనే ఉంటారు. వారు ప్రస్తుతం ఉన్న రంగంలోనే ఆర్థిక సాధికారత చేకూర్చడమే లక్ష్యంగా రాయితీపై డ్రోన్లు అందించనున్నారు. డ్వాక్రా సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళల్లో అధిక శాతం వ్యవసాయాధారిత కుటుంబాలే కావడంతో వీరికి నమోదీదీ పథకం ద్వారా లబ్ధి చేకూర్చాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంకల్పించాయి.

ఆరు నెలల శిక్షణ

రాయితీపై డ్రోన్లు అందుకోనున్న సంఘాలకు, మహిళలకు వాటి నిర్వహణపై ఆరు నెలల పాటు శిక్షణను ప్రభుత్వం ఇవ్వనుంది. ఎరువులు, పురుగు మందులు పిచికారిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏయే మోతాదులో కలిపి డ్రోన్ ద్వారా ఎలా ఉపయోగించాలనే అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ అనంతరం వాటి వాడకానికి ప్రత్యేక అనుమతి పత్రం అందిస్తారు. వరి, మిరప, పత్తి, కూరగాయల సాగులో డ్రోన్ల ఉపయోగం ఎలా ఉండనుంది అనే అంశంతో పాటు దిగుబడుల సమయంలో సాంకేతికతను ఏ విధంగా ఉపయోగించవచ్చనే వాటిని కూడా శిక్షణలో భాగం చేయనున్నారు.

కోలాహలంగా.. అర్బన్ బ్యాంకు నామినేషన్లు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తెనాలి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు నామినేషన్ల కార్యక్రమం కోలాహలంగా జరిగింది. టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వారి కార్యాలయాల నుంచి ర్యాలీగా టీబీ రోడ్డులోని బ్యాంకుకు చేరుకున్నారు. ఎన్నికల అధికారి కె.వెంకటేశ్వరరావు, సహాయ అధికారి రాజేంద్రప్రసాద్‌లకు నామినేషన్ పత్రాలు సమర్పించారు. 12 డైరెక్టర్ పదవులకుగాను టీడీపీ నుంచి ఏడుగురు, జనసేన నుంచి 4, బీజేపీ నుంచి ఒక్కరు మాత్రమే నామినేషన్ వేశారు. దీంతో బ్యాంకు పాలకవర్గం ఏకగ్రీవం కానుంది. 8న స్క్రూట్నీ, 9న ఉపసంహరణ అనంతరం తుది జాబితా ప్రకటిస్తారు. నామినేషన్ వేసిన వారిలో మంగమూరి హరిప్రసాద్, కన్నెగంటి శ్రీనివాసరావు, అక్కిశెట్టి శ్రీనివాసరావు, షేక్ జిలాని, శ్యామ్, కండేపి హరిప్రసాద్, కనగాల శ్రీనివాసరావు, కోటా పున్నారావు, శ్రీనివాసరావు, తోట చంద్రశేఖర్, గండిపాటి నాగయ్య, అన్నవరపు వేణు ఉన్నారు. 12 డైరెక్టర్ల పదవులకు 12 మంది మాత్రమే నామినేషన్ వేయడంతో 14న అధికారికంగా ప్రకటించి చైర్మన్, వైస్ చైర్మన్ పదవులకు ఎన్నిక నిర్వహిస్తారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మహ్మద్ ఖుద్దూస్, జొన్నాదుల మహేష్, గుమ్మడి రమేష్, రావి చిన్ని, కావూరి చంద్రమోహన్, ఈదర పూర్ణచంద్, వీరవల్లి మురళి, జెట్టి రేణుక, జనసేన నాయకులు షేక్ జాకీర్ హుస్సేన్, హరిదాసు గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.


నామినేషన్ దాఖలు చేస్తున్న హరిప్రసాద్

అమరావతిలో.. వెంకన్న వైభోగం

(5వ పేజీ తరువాయి)

విశ్రాంతి భవనాన్ని, ధ్యాన మందిరాన్ని నిర్మించాలని మాస్టర్‌ప్లానులో ప్రతిపాదించారు. వీటితోపాటు విద్యుత్ సబ్‌స్టేషను, సోలార్ లైటింగ్, సోలార్ పవర్‌ప్లాంటు వంటి నిర్మాణాలను కూడా చేపడతారు.

తొలి మాస్టర్‌ప్లాన్ కన్నా మిన్నగానే

తొలి మాస్టర్‌ప్లాన్ ప్రకారం ఐదెకరాల విస్తీర్ణంలో కనీసం రెండు ప్రాకారాలతో ఆలయ నిర్మాణం చేసి 20 ఎకరాల్లో యాత్రికుల వసతి సౌకర్యాలు, ఇతరత్రా ఆధ్యాత్మిక పర్యాటక సుందర నిర్మాణాలను చేపట్టాలని ప్రతిపాదించారు. ఈ మాస్టర్‌ప్లానుకు ప్రస్తుతం మరిన్ని మెరుగులు దిద్ది దాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేలా రూ.185 కోట్లతో ఆలయ విస్తరణపనులను చేపడుతున్నారు. ఇందులో తొలిదశగా రూ107.54 కోట్లతో చేపడుతున్న పనులను రెండేళ్లలో పూర్తిచేయాలని టీటీడీ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ క్రమంలో ఆయా పనులను మూడు ప్యాకేజీలుగా విభజించి మూడు వేర్వేరు టెండర్లను టీటీడీ ఆహ్వానించింది.

పర్యవేక్షణా లోపం..

చంద్రబాబు ఆకాంక్షలకు అనుగుణంగా నిర్మాణ పనులకు టీటీడీ సిద్ధంగానే ఉంది. కానీ కొంత పర్యవేక్షణా లోపం కనిపిస్తుంది. 15 మాసాలుగా ఆలయ రూపురేఖలు ఏ మాత్రం మారలేదు. మాస్టర్‌ప్లాన్ తయారీ, టెండర్ల విడుదలకే చాలా సమయం గడిచి పోయింది. రెండేళ్లలో పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నా పర్యవేక్షణా లోపం కారణంగా జాప్యం జరుగుతుందేమోనని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.45 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00



సమావేశంలో మాట్లాడుతున్న జోసెఫ్ సుధీర్ బాబు

మధ్యంతర భృతిని తక్షణమే ప్రకటించాలి

● ఏపీఎస్టీఎఫ్ జాతీయ కార్యదర్శి సుధీర్ బాబు డిమాండ్

గుంటూరు (విద్య) సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతి చెల్లించాలని ఏపీఎస్టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసెఫ్ సుధీర్ బాబు డిమాండ్ చేశారు. కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో ఆదివారం జరిగిన ఎస్టీయూ ద్వితీయ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు డి.పెదబాబు అధ్యక్షత వహించారు. జోసెఫ్ సుధీర్ బాబు మాట్లాడుతూ 12వ వేతన సవరణ సంఘాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని, 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని, రిటైర్ అయిన వారికి గ్రాట్యుటీ, కమ్యూటేషన్, లీవ్ ఎన్ క్యాష్మెంట్ ఇతర బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. జిల్లా అధ్యక్షులు డి.పెదబాబు మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధన తప్ప ఏ ఇతర బోధనేతర కార్యక్రమాలు లేకుండా చేయాలని, మున్సిపల్ ఉపాధ్యాయుల జీపీఎఫ్ తదితర సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎస్.రామచంద్రయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ప్రసాదరావు, సీనియర్ నాయకుడు ఇ.అంబరీషుడు, గౌరవాధ్యక్షుడు ఎం.వి.ప్రసాద్ బాబు, ఆర్థిక కార్యదర్శి ఎల్.వీరాంజనేయులు, సీనియర్ నాయకులు డీవీ సుబ్బారావు, జి.జోజప్ప, బి.హనుమంత ప్రసాద్, పి.దిబ్బయ్య, వై.మస్తాన్‌రావు పాల్గొన్నారు.



పుస్తకావిష్కరణ చేస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, లక్ష్మణ రెడ్డి తదితరులు

చదువును ఆయుధంగా మార్చుకోవాలి : కమిషనర్

గుంటూరు కార్పొరేషన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులు చదువును ఆయుధంగా మార్చుకుని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్ఎంఎంఎస్) ఉచిత శిక్షణ శిబిరాన్ని గుంటూరులోని భాష్యం ఆడిటోరియంలో పులి శ్రీనివాసులు ప్రారంభించారు. మానవత కార్యదర్శి కె.సతీష్ నేతృత్వంలో జరిగిన శిక్షణ శిబిర కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ పాఠశాలల నుంచి 8వ తరగతి చదువుతున్న 400 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, శిక్షకులు పాల్గొన్నారు. కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రసంగిస్తూ విద్యార్థులు గమ్యాన్ని నిర్దేశించుకుని, క్రమశిక్షణతో అడుగులు వేస్తే గమ్య స్థానాన్ని చేరుకోగలరని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ప్రసంగిస్తూ ప్రతిభ గల విద్యార్థులకు ఆర్థిక వెసులుబాటుతో పాటు ఆత్మవిశ్వాసం పెరుగుతుందని తెలిపారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ ఎన్ఎంఎంఎస్ ద్వారా మధ్యలో బడి మానేసే విద్యార్థుల సంఖ్య తగ్గుతుందని, ప్రతిభ గల పేద విద్యార్థులకు చేయూతనిస్తూ మనోధైర్యాన్ని నింపుతుందని అన్నారు. మానవత కార్యదర్శి కె. సతీష్ ప్రసంగిస్తూ గత ఏడాది నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ శిక్షణ కార్యక్రమం ద్వారా 80 మంది విద్యార్థులు ఎంపిక కావడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో గత సంవత్సరం ఎన్ఎంఎంఎస్ ద్వారా స్కాలర్ షిప్ పొందిన విద్యార్థులను అభినందించారు. విజిఎస్ పబ్లికేషన్స్ ప్రచురించిన ఎన్ఎంఎంఎస్ మెటీరియల్‌తో కూడిన పుస్తకాలను కమిషనర్ శ్రీనివాసులు ఆవిష్కరించారు. మానవత చైర్మన్ పావులూరి రమేష్, టి.ధనుంజయ రెడ్డి, ఉప్పల సాంబశివరావు, పి.విమల కుమారి, టీవీ సాయిరాం, చావా శివాజీ, మేకల రామారావు, చావా లక్ష్మీ సామ్రాజ్యం, కె.పావని ప్రసంగించారు.

చనిపోయిన ఉద్యోగి కుటుంబాన్ని ఆదుకునేందుకే పెన్షన్

● ఈదర వీరయ్య

గుంటూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ పెన్షన్ అనేది చనిపోయిన ప్రభుత్వ ఉద్యోగి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునేందుకు చేసే ప్రయత్నమని, మరణించిన పెన్షనర్ ఎవరినైతే తన వారసులుగా పేర్కొని ఉన్నారో అట్టి వారి పేరు మీద కుటుంబ పెన్షన్ ప్రభుత్వం మంజూరు చేస్తుందని రాష్ట్ర పెన్షన్ దారుల చర్చావేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య తెలిపారు. పెన్షన్, దాని అనుబంధ అంశాలను ఆయన వివరించారు. ఇది ప్రభుత్వం ఆ కుటుంబానికి ఆర్థిక ఉపశమనం కలిగించేందుకు చేసే సంక్షేమ చర్య తప్ప ఆస్తి పరమైన హక్కుల పంపకం ఎంతమాత్రం కాదన్నారు. సదరు ప్రభుత్వ ఉద్యోగి మరణ శాసన పూర్వకంగా సూచించిన వారసులకు ఈ సహాయాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. 1980లో కుటుంబ పెన్షన్ విషయమై జోద్‌సింగ్‌కు భారత ప్రభుత్వానికి మధ్య జరిగిన వివాదంలోనూ సుప్రీంకోర్టు కుటుంబ పెన్షన్ సంబంధించి ఈ విధంగా ప్రతిస్పందించిందన్నారు. కుటుంబ పెన్షన్ చెల్లింపునకు ప్రభుత్వ నియమ నిబంధనలేవీ నామ ప్రతిపాదనను సమకూర్చి పెట్టవన్నారు. కుటుంబ పెన్షన్ హక్కుదారులకు పెన్షన్ సక్రమంగా-వారసులకు 1979 అక్టోబరు 28 నుంచి అమల్లోకి వచ్చినా ఏపీ రివైజ్డ్ పెన్షన్ రూల్స్ 1980 ప్రకారం అందజేయబడుతుందన్నారు. ఏపీ రివైజ్డ్ పెన్షన్ రూల్స్ 1980లోని 50 (12)(బి) ప్రకారం కుటుంబ పెన్షన్ మంజూరు చేసేందుకు ప్రభుత్వ ఉద్యోగి, ఉద్యోగి కుటుంబానికి చెందిన అర్హత కలిగిన కుటుంబ సభ్యులు లేక బంధువులు అర్హులవుతారన్నారు. కుటుంబ పెన్షన్ కుటుంబంలోని ఒకే వ్యక్తికి ఒకసారి మాత్రమే చెల్లించబడుతుందన్నారు. మొదటి ప్రాధాన్యత వైధవ్యం పొందిన భార్యకు ఇవ్వబడుతుందన్నారు. తదనంతరం అర్హత కలిగిన పిల్లలకు వారి పుట్టుక క్రమాన్ని బట్టి అర్హత లభిస్తుందని తెలిపారు. కవల పిల్లలు ఉన్నప్పుడు కుటుంబ పెన్షన్ చెరిసగం పంచబడుతుందని వీరయ్య తెలిపారు.

ఆస్టియో పోరోసిస్ వ్యాధి చికిత్స కంటే జాగ్రత్త పడటమే ముఖ్యం

● సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ కొల్లి జయకిషన్

గుంటూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆస్టియో పోరోసిస్ వ్యాధి చికిత్స కంటే రాకుండా జాగ్రత్త పడటమే ముఖ్యమని సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కొల్లి జయకిషన్ పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఆరోగ్యసభలో ఆయన ప్రసంగించారు. ఆస్టియో పోరోసిస్ వ్యాధితో చిన్న దెబ్బలకే ఎముకలు విరిగిపోవటం, కొంత మందికి వెన్నుపూసలు, పక్కటెముకలు సైలెంట్‌గా ఫ్రాక్చర్ అవుతాయన్నారు. ఆహారంలో కాల్షియం, విటమిన్ డి ఉండే ఆహార పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివ రామిరెడ్డి, టీవీ సాయిరామ్, రామచంద్రరావు, చల్లా అంజిరెడ్డి తదితరులున్నారు.

వైద్య కళాశాలలపై వైసీపీ తప్పుడు ప్రచారం

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మెడికల్ కాలేజీల నిర్మాణంపై వైసీపీ ప్రజలను తప్పుదారి పట్టించేలా దుష్ప్రచారానికి పూనుకుందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం ఆయన రూ.5 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులను అందించారు. ఈ సందర్భంగా మెడికల్ కాలేజీల అంశంపై మాట్లాడారు. రాష్ట్రంలో పది మెడికల్ కాలేజీలను పీపీపీ పద్ధతిలో నిర్మించేందుకు సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ప్రజలు స్వాగతిస్తున్నారని తెలిపారు. ఈ కాలేజీలను 2027- 28లోగా పూర్తి చేయడం ద్వారా ఒక్కో కాలేజీలో 150 మెడికల్ సీట్లు పెరుగుతాయని చెప్పారు. కాలేజీల నిర్మాణం పూర్తయ్యాక వాటి నిర్వహణ, యాజమాన్య హక్కులు పూర్తిగా ప్రభుత్వం వద్దే ఉంటాయని, తద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో నిర్మించిన కాలేజీల్లో కనీస మౌలిక వసతులు కూడా లేవని, 59 శాతం మేర ప్రొఫెసర్ల కొరత ఉందని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చాక ఆయా కాలేజీల్లో అన్ని సదుపాయాలు కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైద్య శాఖలో మూడు వేల పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుందని, రూ.4500 కోట్లతో ఆస్పత్రుల అభివృద్ధికి శ్రీకారం చుట్టిందన్నారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా నిరుపేదలకు వైద్యానికి భరోసా కల్పిస్తోందని, ఇది కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి అని స్పష్టం చేశారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్

చంద్రగ్రహణంతో ఆలయాలు మూసివేత

● నేడు సంప్రోక్షణ అనంతరం భక్తులకు దర్శనం

గుంటూరు కార్పొరేషన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా జిల్లాలోని అన్ని దేవాలయాలను ఆలయ అధికారులు మూసి వేశారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి సోమవారం ఉదయం వరకు ఆలయా లను మూసివేశారు. ప్రధాన ద్వారాలకు ఆలయ అధికారులు, అర్చకులు, ఉద్యోగులు తాళాలు వేశారు. చంద్రగ్రహణం పూర్తి అయిన తర్వాత సోమవారం ఉదయం ఆలయాల్లో సంప్రోక్షణ నిర్వహించిన అనంతరం తిరిగి భక్తులకు దర్శ నాన్ని, అన్ని రకాల సేవలను కల్పించనున్నారు. పాత బస్టాండ్‌లోని లాలాపేట శ్రీ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవస్థానం, కొత్తపేట నాజ్ సెంటర్ శ్రీ అభయాంజనేయ స్వామి దేవస్థానం, కొత్తపేటలోని పశువుల ఆసుపత్రి ఎదురు గల రుక్మిణి సత్యభామ సమేత జగన్నాథ స్వామి దేవస్థానంలో ఆలయ అర్చకులు, అధికారులు ఆలయ ప్రధాన ద్వారాలను మూసివేశారు.



లాలాపేట వేంకటేశ్వర స్వామి దేవస్థానం, నాజ్ సెంటర్ ఆంజనేయ స్వామి దేవస్థానంలో మూసివేసిన ప్రధాన ద్వారం

వాసవి క్లబ్ సేవలను మరింతగా విస్తృత పరుస్తాం

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వాసవి క్లబ్ సేవలను మరింతగా విస్తృత పరిచేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు ఆ క్లబ్ జిల్లా గవర్నర్ పులికొండ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఆర్ అగ్రహారం, గీతా మందిరంలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం వృద్ధులకు పెన్షన్, ఉచిత బియ్యం, విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు రాయవరపు అశోక్ కుమార్ మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా 108 మంది వృద్ధులకు పెన్షన్, బియ్యం, విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ, కాశీ విశ్వనాథ గోసంరక్షణకు విరాళాన్ని అందజేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి కూనిశెట్టి చంద్రశేఖరరావు, వేమూరి ప్రదీప్, రాయవరపు అనురాధ, బొల్లిశెట్టి పాపారావు, ఆకుల మురళీకృష్ణ, సత్యనారాయణ, లక్ష్మీరాధా, భాస్కర్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భక్త అంబరీష హరికథా గానం

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై శ్రీ ఆదిభట్ల నారాయణదాస కథాగాన కళాపరిషత్ వారి ఆధ్వర్యంలో శ్రీ నారాయణ దాస 161వ జయంతోత్సవాలు ఆదివారం ముగిశాయి. సప్పా భారతిచే భక్త అంబరీష హరికథాగానం ప్రేక్షకులను ఆకట్టుకుంది. తొలుత ఆలయ కమిటీ, సంస్థ వారు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సప్పా భారతి హరికథను ప్రారంభిస్తూ శ్రీమన్నారాయణుడి పట్ల అతని అచంచలమైన భక్తి, ఏకాదశీ వ్రత మహత్యం, అతిథి దేవుడు అయిన దుర్వాస మహాముని పట్ల అతని సహనం, గౌరవం చుట్టూ తిరుగుతుందన్నారు. వీరికి మృదంగంపై జగన్మోహిని, వయోలిన్‌పై చావలి శ్రీనివాస్ చక్కటి వాయిద్య సహకారం అందించారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక హిందూ కళాశాల ప్రాంగణంలో రాధా మాధవ రసరంజని 322వ నెల నెల వెన్నెల కార్యక్రమం సందర్భంగా ఆదివారం జరిగిన నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. శ్రీ సీతారత్న లలితా కళా నృత్యనికేతన్, జగ్గంపేట వారు పలు కీర్తనలకు కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించి ప్రేక్షకులను అలరించారు. ఈ నృత్య ప్రదర్శనకు నాట్యాచారిణి ముళ్లపూడి విజయలక్ష్మి నృత్య దర్శకత్వం వహించారు. అనంతరం రాధా మాధవ నాట్యక్షేత్రం వారు విద్యార్థులు పలు పాటలకు జానపద నృత్యాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా నంది అవార్డు గ్రహీత అద్దంకి నాగరాజు ప్రదర్శించిన టాకింగ్ డాల్ మ్యాజిక్ షో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాలను సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి నాట్యాచార్య ఎస్కే ఖలీల్ పర్యవేక్షించారు.

రజక బాల బాలికలకు విద్యా ప్రోత్సాహక బహుమతులు

గుంటూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రజక బాలబాలికల విద్యా ప్రోత్సాహక అసోసియేషన్ కన్వీనర్ నిడుబ్రోలు సాంబశివరావు ఆధ్వర్యంలో గుంటూరులోని స్థానిక రజక కమ్యూనిటీ హాల్లో బీసీ సంక్షేమ వసతి గృహాలలో ఉండే రజక బాల బాలికలకు విద్యా ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఈ సందర్భంగా వారికి స్కూల్ బ్యాగులు, బెడ్ షీట్స్, టవల్స్ బహుమతులు అందించి, రజక ఉపాధ్యాయని, ఉపాధ్యాయులకు ప్రశంసా పత్రాలతో దుశ్శాలువాతో సత్కరించారు. ఆంధ్ర యూనివర్సిటీ ప్రొఫెసర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ 14 సంవత్సరాల నుంచి రజక విద్యార్థినీ, విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు ఇవ్వటం అభినందనీయమని అన్నారు. ప్రొఫెసర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ రజక జాతి అభివృద్ధి చెందాలంటే రజక విద్యార్థిని, విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించాలన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి బద్వేలు గురుమూర్తి మాట్లాడుతూ విద్య ద్వారానే సామాజిక సమానత్వం కలుగుతుందన్నారు. దేవరపల్లి హరిప్రసాద్, రమేష్ బాబు, ఐడియాల సాంబశివరావు, కోటేశ్వరరావు పర్యవేక్షణలో ప్రముఖులైన ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానించారు. రజక సంఘంలో నిస్వార్థంగా సేవలందిస్తున్న నిడుబ్రోలు సాంబశివరావుని శాలువాతో సత్కరించి షూట్కే బాబా అవార్డును ప్రదానం చేశారు. బీసీ వెల్ఫేర్ అధికారి సుమిత్రాదేవి, రజక సీనియర్ నాయకులు కొండపాటూరు సాంబశివరావు, సంజీవరావు, లాయరు శ్రీధర్, చేతి వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మున్నూరు భాస్కరయ్య, జాతీయ బీసీ బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ నరసింహారావు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసీపీ నేతలకు నియోజకవర్గాల పర్యవేక్షక బాధ్యతలు

గుంటూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి) : జిల్లాకు చెందిన వైసీపీ నేతలకు నియోజకవర్గాల పర్యవేక్షక బాధ్యతలు అప్పగిస్తూ వైసీపీ అధిష్ఠానం ఉత్తర్వులు జారీ చేసింది. మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణకు గుంటూరు పశ్చిమ, తూర్పు నియోజకవర్గాలు, షేక్ గులాం రసూల్‌కు తెనాలి, ప్రత్తిపాడు, బుర్రముక్కల వేణుగోపాల్‌రెడ్డికి పొన్నూరు, బాపట్లకు చెందిన మదన్‌మోహన్ గౌడ్ కు తాడికొండ, మంగళగిరి నియోజకవర్గాల పర్యవేక్షక బాధ్యతలు అప్పగించారు.



చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద చేపట్టిన నిరసనలో పాల్గొన్న రజక చైతన్య వేదిక సభ్యులు

రజకులపై దాడులు దురదృష్టకరం

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా, కొత్తవలస గ్రామంలో రజకులపై కళింగుల సామాజిక వర్గానికి చెందిన వారు దాడి చేయడం దురదృష్టకరమని రజక చైతన్య వేదిక అధ్యక్షుడు మానేపల్లి దుర్గారావు అన్నారు. దాడులకు నిరసనగా ఆదివారం స్థానిక చంద్రమౌళి నగర్లో, చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దాడులలో ఒక రజక మహిళ మరణించడంతో పాటు చాలా మంది బలమైన గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. బాధిత కుటుంబానికి రూ.కోటి పరిహారంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్నారు. దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ నిరసనల్లో రాచకొండ లక్ష్మయ్య, పూరే శ్రీనివాసరావు, డి.రంగన్న, శంకరరావు, బాజీ, కామేశ్వరరావు పాల్గొన్నారు.

అన్నపూర్ణ కాంప్లెక్స్‌లో వ్యాపారులకు అనుమతులు ఇవ్వాలి

గుంటూరు కార్పొరేషన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అన్నపూర్ణ కాంప్లెక్స్‌లో కూరగాయల వ్యాపారం నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని కొల్లి శారదా హోల్ సేల్ మార్కెట్ ప్రెసిడెంట్ ఎర్రంశెట్టి సత్యనారాయణ కోరారు. కాంప్లెక్స్ ఆవరణలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొల్లి శారదా మార్కెట్‌లో సరైన వసతులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, పైగా మార్కెట్‌లో ఉన్న దుకాణాలకు పెద్ద ఎత్తున అద్దెలు చెబుతున్నారని వాపోయారు. దీనిని దృష్టిలో పెట్టుకుని అన్నపూర్ణ కాంప్లెక్స్‌లో వ్యాపారాలు నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. వ్యాపారి శివ మాట్లాడుతూ అధికారులు స్పందించి తగు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో వ్యాపారస్తులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

‘స్త్రీ శక్తి’ సభలో ప్రతి ఒక్కరూ పాల్గొనండి

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి



ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో సోమవారం జరగనున్న ‘స్త్రీశక్తి’ సభలో నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి విజ్ఞప్తి చేశారు. ఏటుకూరు రోడ్డులోని వివాహ కన్వెన్షన్ హాల్‌లో సోమవారం సాయంత్రం 5 గంటలకు ‘సూపర్ సిక్స్- సూపర్ హిట్- స్త్రీ శక్తి’ సభ జరుగుతుందని ఆమె తెలిపారు. సాయంత్రం 4 గంటలకు భారీ ర్యాలీగా కార్యకర్తలు, అభిమానులు, మహిళా శక్తి ఊరేగింపుగా సభా ప్రాంగణానికి చేరుకుంటారని, రాష్ట్ర స్థాయి నాయకులు, కార్పొరేషన్ చైర్మన్లు, ప్రముఖ ప్రజాప్రతినిధులు సభలో పాల్గొంటారని ఆమె తెలియజేశారు. గుంటూరు పశ్చిమ ప్రజల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, మహిళా సాధికారత గురించి ఈ సభలో నేతలు ప్రసంగిస్తారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

స్వయం భూ కవి సుబ్బారావు

గుంటూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్వయం భూ కవి చిటిప్రోలు సుబ్బారావు అని అమరావతి సాహితి మిత్రులు సంస్థ అధ్యక్షులు డాక్టర్ రావి రంగారావు తెలిపారు. బ్రాడీపేట సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ సమావేశ మందిరంలో ఆదివారం ‘అమరావతి సాహితీ మిత్రులు’ నిర్వహించిన చిటిప్రోలు సుబ్బారావు వెన్నెల గింజలు కవిత్వ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. వ్యాపార రంగంలో పలు సేవలందించి పదవీ విరమణ తరువాత నిద్రాణమై ఉన్న కవిత్వ శక్తిని మేలుకొలుపుకుంటూ సహజ కవిగా అద్భుతమైన భావనల్ని ‘వెన్నెల గింజలు’ పేరుతో పుస్తకం ప్రచురించటం అభినందనీయం అన్నారు. ‘వెన్నెల గింజలు’ కవిత్వ సంపుటిని రావి రంగారావు, డాక్టర్ టీ సేవకుమార్, డాక్టర్ గుమ్మా సాంబశివరావు, నాగరాజ్యలక్ష్మి, సిహెచ్ వెంకటరత్నం, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ బీరం సుందరరావు ఆవిష్కరించారు. సభలో కవి చిటిప్రోలు సుబ్బారావును రావి రంగారావు, సేవకుమార్ మొదలైన వారు ఘనంగా సత్కరించారు.



సుబ్బారావును సత్కరిస్తున్న రంగారావు, సేవకుమార్ తదితరులు

తెలుగు మహాసభలకు తమిళనాడు గవర్నర్‌కు ఆహ్వానం

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర సారస్వత పరిషత్, ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో వచ్చే ఏడాది జనవరి 3 తేదీ నుంచి గుంటూరులో జరిగే 3వ ప్రపంచ తెలుగు మహాసభలకు తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవిని కలసి ఆహ్వానించినట్లు పరిషత్ అధ్యక్షుడు డా.గజల్ శ్రీనివాస్ తెలిపారు. తమిళనాడులోని పలు ప్రాంతాల నుంచి తెలుగు మహా సభలకు తెలుగు ప్రజలు హాజరుకానున్నారని గవర్నర్‌కు విన్నవించినట్లు చెప్పారు. మహాసభల ప్రారంభోత్సవ సభకు విశిష్ఠ అతిథిగా వచ్చి తెలుగు ప్రజలను ఉద్దేశించి ప్రసంగించేందుకు గవర్నర్ సుముఖత చూపారని గజల్ శ్రీనివాస్ పేర్కొన్నారు.

దిక్సూచి

బిట్స్ లా స్కూల్ అడ్మిషన్స్

ముంబాయిలోని బిట్స్ లా స్కూల్‌లో 2026 విద్యాసంవత్సరానికి సంబంధించి ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ బీఏ ఎల్ఎల్‌బీ(ఆనర్స్), బీబీఏ ఎల్ఎల్‌బి(ఆనర్స్)లో అడ్మిషన్స్ కోసం నోటిఫికేషన్ వెలువడింది. ఈ కోర్సులకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆమోదం ఉందని సంస్థ వెబ్‌సైట్ పేర్కొంది. టెక్నాలజీ అండ్ మీడియా లా, కార్పొరేట్ అండ్ ఫైనాన్షియల్ లా, ఎంటర్‌టైన్‌మెంట్ అండ్ స్పోర్ట్స్ లా, ఆల్టర్నేట్ డిస్ప్యూట్ రిజల్యూషన్, అండ్ మీడియేషన్ అనే స్పెషలైజేషన్లు ఇందులో ఉన్నాయి.

బీఏ ఎల్ఎల్‌బీ(ఆనర్స్) 120 సీట్లు,
బీబీఏ ఎల్ఎల్‌బి(ఆనర్స్) 60 సీట్లు
మొత్తం 180

అర్హత: కనీసం 45 శాతం మార్కులతో ఇంటర్ పూర్తిచేసి ఉండాలి. అలాగే క్లాట్/ఏఐఎల్ఈటీ/స్లాట్/ఎల్‌నాట్/బిట్స్ లాట్ లో స్కోరు సాధించి ఉండాలి. ఎక్స్‌ట్రా కరిక్యులర్ ఎచీవ్‌మెంట్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థుల ఎంపిక ఉంటుంది.

ఎంట్రెన్స్: పరీక్ష ఆన్‌లైన్‌లో జరుగుతుంది. 70 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలకు 60 నిమిషాల్లో సమాధానాలను గుర్తించాలి. నెగెటివ్ మార్కింగ్ లేదు. రీజనింగ్ ఎబిలిటీ, వెర్బల్ ఎబిలిటీ, కరెంట్ అఫైర్స్, జనరల్ నాలెడ్జ్ తదితరాలపై ప్రశ్నలు ఉంటాయి.

ఫీజు: కాలేజీ ఫీజు రూ.7,37,100/-, హాస్టల్ ఫీజు 3,27,600/-.(కాలేజీలో స్కాలర్‌షిప్స్ కూడా అందుబాటులో ఉన్నాయి.

చివరి తేదీ: 2026 జనవరి 6
క్లాసులు ప్రారంభం: 2026 జూలై
వెబ్‌సైట్: www.bitslawschool.edu.in



గ్రామీణ బ్యాంకుల్లో పోస్టులకు ఐబీపీఎస్ నోటిఫికేషన్



దేశ వ్యాప్తంగా ఉన్న ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల్లో క్లర్క్, ఆఫీసర్ల నియామకాల కోసం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలెక్షన్(ఐబీపీఎస్) నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా మొత్తం 13,217 ఖాళీలు భర్తీ చేయనున్నారు. ఇందులో తెలంగాణలో 798 పోస్టులు(450 ఆఫీస్ అసిస్టెంట్లు, 348 ఆఫీసర్లు), ఏపీలో 152(150 ఆఫీస్ అసిస్టెంట్, 2 ఆఫీసర్) పోస్టులు ఉన్నాయి.

పేరు	పోస్టులు
ఆఫీస్ అసిస్టెంట్స్	7972
ఆఫీసర్ స్కేల్-1(అసిస్టెంట్ మేనేజర్)	3907
స్కేల్ 2, స్కేల్ 3	1338

(ఈ స్కేల్ 2, స్కేల్ 3లో అగ్రికల్చర్ ఆఫీసర్, లా ఆఫీసర్, సీఏ, ఐటీ, జనర్ బ్యాంకింగ్ ఆఫీసర్, మార్కెటింగ్ ఆఫీసర్, ట్రెజరీ మేనేజర్ తదితరాలు ఉన్నాయి).

వయస్సు: ఆఫీస్ అసిస్టెంట్‌కు 18-25 ఏళ్లు, ఆఫీసర్ స్కేల్-1కు 18-30 ఏళ్లు, ఆఫీసర్ స్కేల్-2కు 21-32 ఏళ్లు, ఆఫీసర్ స్కేల్-1కు 21-40 ఏళ్లు ఉండాలి. సరైన కటాఫ్ డేట్స్ కోసం నోటిఫికేషన్ చూడవచ్చు.

ఎంపిక విధానం: ప్రిలిమినరీ, మెయిన్స్, ఇంటర్వ్యూ(కొన్ని పోస్టులకు ఇంటర్వ్యూ లేదు) ద్వారా ఎంపిక జరుగుతుంది. మల్టీ పర్పస్ అసిస్టెంట్ ప్రిలిమినరీ పరీక్షలో రీజనింగ్, న్యూమరికల్ ఎబిలిటీపై 80 మార్కులకు, 80 ప్రశ్నలు ఉంటాయి. వీటికి 45 నిమిషాల్లో సమాధానాలు గుర్తించాల్సి ఉంటుంది. ఆఫీసర్ ప్రిలిమినరీ పరీక్షలో రీజనింగ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 80 మార్కులకు, 80 ప్రశ్నలు ఉంటాయి. వీటికి 45 నిమిషాల్లో సమాధానాలు గుర్తించాల్సి ఉంటుంది. మెయిన్స్‌లో రీజనింగ్, కంప్యూటర్ నాలెడ్జ్, జనరల్ అవేర్‌నెస్, ఇంగ్లిష్ లాంగ్వేజ్, న్యూమరికల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ తదితరాలపై ప్రశ్నలు ఉంటాయి.

పరీక్ష: 2025 నవంబర్/డిసెంబర్‌లో ప్రిలిమ్స్, 2025 డిసెంబర్ /2006 జనవరిలో మెయిన్స్ ఉంటుంది.

చివరి తేదీ: 2025 సెప్టెంబర్ 29 **వెబ్‌సైట్:** https://ibps.in/

ఇండియన్ నేవీలో ఎస్ఎస్‌సీ ఆఫీసర్లు

మొత్తం ఖాళీలు 260

ఇండియన్ నేషనల్ అకాడమీ(ఐఎన్ఏ) నుంచి షార్ట్ సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్ వెలువడింది. 2026 జూన్‌లో ప్రారంభమయ్యే ఈ కోర్సుకు అవివాహితులైన పురుష, మహిళా అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

కోర్సు వివరాలు: షార్ట్ సర్వీస్ కమిషన్ ఆఫీసర్, 2025

బ్రాంచి వివరాలు:
- ఎగ్జిక్యూటివ్ బ్రాంచ్(జీఎస్(ఎక్స్)/హైడ్రో కేడర్): 57
- పైలెట్: 24
- నేవల్ ఎయిర్ ఆపరేషన్స్ ఆఫీసర్: 20
- ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్: 20
- లాజిస్టిక్స్: 10
- నేవల్ ఆర్నమెంట్ ఇన్‌స్పెక్టరేట్ కేడర్: 20 పోస్టులు
- లా: 2
- ఎడ్యుకేషన్: 15
- ఇంజనీరింగ్ బ్రాంచ్(జనరల్ సర్వీస్) 36
- ఎలక్ట్రికల్ బ్రాంచ్(జనరల్ సర్వీస్) 40
- నేవల్ కన్‌స్ట్రక్టర్: 16

అర్హత: పోస్టును బట్టి సంబంధిత బ్రాంచీలో బీఎస్సీ, బీకాం, బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ, ఎంఎస్సీ, లా,పీజీ, పీజీ డిప్లొమా ఉండాలి. అభ్యర్థులకు నోటిఫికేషన్‌లో పేర్కొన్న శారీరక, వైద్య ప్రమాణాలు ఉండాలి.

వయస్సు: 2001 జూలై 2 నుంచి 2007 జనవరి 1 లోపు జన్మించి ఉండాలి.

చివరి తేదీ: 2025 సెప్టెంబర్ 8.
వెబ్‌సైట్: https://www.joinindiannavy.gov.in/



బీహెచ్‌ఈఎల్‌లో గ్రేడ్-4 ఉద్యోగాలు

మొత్తం ఖాళీలు 515

భారత్ హెవీ ఎలక్ట్రికల్ లిమిటెడ్(బీహెచ్‌ఈఎల్)లోని హైదరాబాద్, విశాఖపట్నం సహా దేశ వ్యాప్తంగా ఉన్న 11 యూనిట్లలోని 515 ఆర్టిసన్ గ్రేడ్-4 పోస్టుల భర్తీకి దరఖాస్తులను కోరుతోంది. (ఫిట్టర్ 176, వెల్డర్ 97, టర్నర్ 51, మెషినిస్ట్ 104, ఎలక్ట్రీషియన్ 65, ఎలక్ట్రానిక్ మెకానిక్ 18, ఫౌండ్రీమన్ 4)

చివరి తేదీ: 2025 సెప్టెంబర్ 12
అర్హత: పదో తరగతితోపాటు ఐటీఐ/ సమాన అర్హత ఉండాలి.
వయస్సు: 2025 జూన్ 1 నాటికి జనరల్/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 27 సంవత్సరాలు, ఓబీసీ వారికి 30, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు 32 మించి ఉండకూడదు. సంబంధిత ట్రేడ్ అనుభవం ఉంటే వయోపరిమితిలో ఏడు సంవత్సరాల సడలింపు ఉంటుంది.
వెబ్‌సైట్: https://careers.bhel.in

ఎల్ఐసీలో అప్రెంటిస్‌షిప్

ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్‌లో తెలంగాణ, ఏపీ సహా వివిధ రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న అప్రెంటిస్ పోస్టుల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కోరుతున్నారు. అభ్యర్థులు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలి.

చివరి తేదీ: 2025 సెప్టెంబర్ 22
వెబ్‌సైట్: www.lichousing.com/careers

నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీమ్ 2025

ఆర్థికంగా వెనకబడిన విద్యార్థులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌ను ప్రారంభించింది. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు చదువుకునే పేద విద్యార్థులను ప్రోత్సహించడం ఈ స్కీమ్ ఉద్దేశం. ఆంధ్రప్రదేశ్ డైరెక్టరేట్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్(ఏపీ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్) విభాగం దీనికి సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పథకం కింద పరీక్ష నిర్వహించి, ఎంపికైన అభ్యర్థులకు స్కాలర్‌షిప్ అందిస్తారు. దేశ వ్యాప్తంగా లక్ష మందికి ఈ ప్రోత్సాహకాన్ని అందిస్తారు. అందులో ఆంధ్రప్రదేశ్‌కి 4087 స్కాలర్‌షిప్‌లను కేటాయించారు ప్రభుత్వ/ స్థానిక సంస్థలు/ మున్సిపల్/ ఎయిడెడ్ పాఠశాలలు/ మోడల్ పాఠశాలలు చదివే విద్యార్థులు అర్హత పరీక్ష రాయవచ్చు. రెసిడెన్షియల్ విద్యార్థులు అర్హులు కారు.

ఆర్థిక ప్రోత్సాహం: ఈ పథకానికి ఎంపికైన వారికి నెలకు వేయి చొప్పున ఏడాదికి మొత్తం 12,000/- రూపాయలు అందిస్తారు. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ పూర్తి చేసే వరకు నాలుగు సంవత్సరాలు ఈ ఉపకార వేతనం లభిస్తుంది.

అర్హత: ఏడో తరగతిలో 55 శాతం మార్కులు పొంది ఉండాలి. తుది ఎంపిక సమయానికి ఎనిమిదో తరగతిలో 55 శాతం మార్కులు సాధించి ఉండాలి. విద్యార్థి కుటుంబ వార్షిక ఆదాయం 3,50,000/- రూపాయలకు మించి ఉండకూడదు.

దరఖాస్తు: రాష్ట్ర ప్రభుత్వ సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డ్ వైబ్‌సైట్ ద్వారా ఆయా స్కూల్స్ ఆన్‌లైన్‌లో దరఖాస్తులను సమర్పించాలి. తర్వాత దరఖాస్తుల ప్రింటౌట్, ధ్రువీకరణ పత్రాలను డీఈవోలకు పంపాలి. ఓసీ/బీసీ విద్యార్థులకు పరీక్ష ఫీజు రూ.100/-, ఎస్సీ/ఎస్టీ విద్యార్థులకు రూ.50/- ఉంటుంది.

చివరి తేదీ: 2025 సెప్టెంబర్ 30 **వెబ్‌సైట్:** www.bse.ap.gov.in/

SCHOLARSHIP ALERT

Schaeffler India Social Innovator Fellowship Program 2025

Description: Schaeffler India invites applications from individuals aged 18 to 35 who are building innovative, sustainable solutions with the potential to create meaningful social impact across India.
Eligibility: Applicants must be Indian residents aged 18 to 35 years as of 1st July 2025. The fellowship is open to early-stage start-ups or NGOs with a working prototype ready for implementation.
Prizes & Rewards: Exclusive mentorship at IIMA Ventures, IIM Ahmedabad, paired with an inspiring fellowship grant and access to extensive networking opportunities.
Last Date to Apply: 15-09-2025
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/SIA4

Infosys Foundation STEM Stars Scholarship Program

Description: An initiative of Infosys Foundation to support female students in India who aspire to pursue undergraduate degrees in STEM (Science, Technology, Engineering, Mathematics) disciplines.
Eligibility: The applicants must be female students from India.
- They should have successfully completed their Class 12 examinations.
- Eligible students include those enrolled in the first year of undergraduate STEM courses at recognised NIRF-accredited institutions. Additionally, second-year B.Arch students and those pursuing five-year Integrated or Dual Degree programs are also welcome to apply.
- Female students intending to pursue engineering and medical courses in government colleges not listed in the NIRF rankings are also eligible to apply.
- The annual family income of the applicants must not exceed 8,00,000.

Prizes & Rewards: The selected candidates will receive a scholarship of up to 1,00,000 per annum, covering actual expenses, for the duration of the course.
Last Date to Apply: 15-09-2025
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/ISTS3


buddy4study.com

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

ఉత్కంఠకు లోనయ్యా

– ఇమ్రాన్ హష్మీ



పవన్ కల్యాణ్ కథానాయకుడిగా సుజిత్ దర్శకత్వంలో 'ఓజీ' అనే చిత్రం తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. గ్యాంగ్‌స్టర్ డ్రామా నేపథ్యంలో రూపుదిద్దుకుంటోన్న ఈ చిత్రంలో ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయిక. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్‌పై డీవీవీ దానయ్య నిర్మిస్తున్నారు. ఈనెల 25న ప్రపంచ వ్యాప్తంగా తెలుగుతో పాటు పలు భారతీయ భాషల్లో విడుదల కానుంది. కాగా, బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ ఈ చిత్రం ద్వారా తొలిసారిగా తెలుగు ప్రేక్షకులను పలకరించనున్నారు. ఇందులో ఆయన ప్రతినాయకుడి పాత్రలో కనిపించబోతున్నారు. కాగా, ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఇమ్రాన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'సినిమా కోసం నన్ను సంప్రదించినప్పుడు ఉత్కంఠకు లోనయ్యా. ఇది నాకు తెలుగులో తొలి సినిమా. సూపర్ స్టార్ పవన్ కల్యాణ్‌తో కలసి తెరను పంచుకోవడం కంటే గొప్ప విషయం ఇంకేముంటుంది. పవన్ కల్యాణ్, చిత్ర దర్శకుడు సుజిత్‌తో కలసి పనిచేయడం అద్భుతమైన అనుభవం' అని చెప్పారు.

నయన్‌తో డ్యూయెట్





చిరంజీవి కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'మన శంకర వరప్రసాద్ గారు'. నయనతార కథానాయిక. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలు పెంచాయి. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. నేటి నుంచి హైదరాబాద్‌లో చిరంజీవి, నయనతారపై ఓ పాటను చిత్రీకరించనున్నట్టు యూనిట్ తెలిపింది. ఈ గీతానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించగా, డ్యాన్స్ మాస్టర్ విజయ్ పోలంకి నృత్య రీతులు సమకూర్చుతున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఊహకందని మలుపులతో...



బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమా పరమేశ్వరన్ జంటగా నటించిన చిత్రం 'కిష్కింధపురి'. కౌశిక్ పెగల్లపాటి దర్శకత్వంలో సాహు గారపాటి నిర్మించారు. ఈ నెల 12న విడుదలవుతోంది. చిత్ర బృందం ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచింది. ఈ సందర్భంగా బెల్లంకొండ సాయి శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ 'ఇప్పటివరకూ ప్రేక్షకులు చాలా హారర్ సినిమాలు చూసి ఉంటారు. కానీ 'కిష్కింధపురి' చాలా ప్రత్యేకం. థ్రిల్లింగ్ అంశాలతో ఊహకందని మలుపులతో సాగుతుంది. విజువల్ ఎఫెక్ట్స్ అద్భుతంగా వచ్చాయి' అని అన్నారు. అనుపమా పరమేశ్వరన్ మాట్లాడుతూ 'నాకు చిన్నప్పటి నుంచి హారర్ చిత్రాలంటే చాలా ఇష్టం. 'కిష్కింధపురి' ప్రేక్షకులకు కొత్త తరహా అనుభూతిని ఇస్తుంది. హారర్ ఎలిమెంట్స్ అబ్బురపరుస్తాయి' అని చెప్పారు.

బిగ్‌బాస్ 9 ప్రారంభం




బుల్లితెర ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్న టెలివిజన్ రియాలిటీ షో 'బిగ్‌బాస్ సీజన్ 9' ఆదివారం ప్రారంభమైంది. ఈ సీజన్ ఊహకందని మార్పులు, ఊహించని మలుపులతో ఉండబోతోందని వ్యాఖ్యాత నాగార్జున అన్నారు. ఈసారి సెలబ్రిటీలతో పాటు సామాన్యులకూ సమాన అవకాశం ఇస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఎంపిక చేసిన కంటెస్టెంట్లను ప్రేక్షకులకు పరిచయం చేశారు.

ఈ సీజన్ కంటెస్టెంట్లు

1. కన్నడ నటి తనూజ పుట్టస్వామి	సెలబ్రిటీ
2. హీరోయిన్ ఫ్లోరా సైనీ(ఆశా సైనీ)	సెలబ్రిటీ
3. కల్యాణ్ పడాల	సామాన్యుడు
4. 'జబర్దస్త్' ఇమ్మాన్యుయేల్	సెలబ్రిటీ
5. కొరియోగ్రాఫర్ శ్రష్టి వర్మ	సెలబ్రిటీ
6. హరిత హరీశ్(మాస్క్ మెన్)	సామాన్యుడు
7. నటుడు భరణి	సెలబ్రిటీ
8. నటి, యాంకర్ రీతూ చౌదరి	సెలబ్రిటీ
9. డిమాన్ పవన్	సామాన్యుడు
10. నటి సంజన గల్రానీ	సెలబ్రిటీ
11. గాయకుడు రాము రాథోడ్	సెలబ్రిటీ
12. శ్రీజ దమ్ము	సామాన్యురాలు
13. హాస్య నటుడు సుమన్ శెట్టి	సెలబ్రిటీ
14. ప్రియ శెట్టి	ఆడియెన్స్ పోల్
15. మర్యాద మనీశ్	ప్రత్యేక ఎంపిక

గాయకుడిగా ప్రకాశ్ రాజ్



ఇప్పటి వరకు వెండి తెరపై తన విలక్షణ నటనతో మెప్పించిన ప్రకాశ్ రాజ్ ఇప్పుడు గాయకుడిగా కూడా అలరించబోతున్నారు. ఇందుకోసం ఆయన తన బృందంతో కలసి శ్రీలంక చేరుకున్నారు. ఇక్కడి క్యాండీ నగరంలో ఈనెల 8, 9 తేదీల్లో నిర్వహిస్తోన్న 'నియేలిని గ్లోబల్ సమ్మిట్'లో ప్రకాశ్ రాజ్ పాల్గొంటున్నారు. ఈ సదస్సుకు 102 దేశాలకు చెందిన పౌర సంఘాల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, శాస్త్రవేత్తలు సుమారు 500 మంది హాజరవుతున్నారు. ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న ఆహారభద్రత, వ్యవసాయ రంగంలో సంక్షోభంపై ప్రముఖంగా చర్చించనున్నారు. ఈ సదస్సుకు సంఘీభావంగా 'సాంగ్స్ ఆఫ్ రెసిలియన్స్' పేరుతో నిర్వహించనున్న కచేరీలో ప్రకాశ్ రాజ్ తన బృందంతో కలసి స్వయంగా కవితాగానం చేయనున్నారు.

అద్భుతమైన ప్రయాణమిది


రాశీ ఖన్నా

'కెమెరాలు ఆగిపోయిన తర్వాత కూడా మరచిపోలేని కథలు ఉంటాయి. 'తెలుసు కదా' అలాంటి కథల్లో ఒకటి. అద్భుతమైన అనుభవాలన్నీ కలగలసిన ప్రయాణమిది' అని అన్నారు కథానాయిక రాశీ ఖన్నా. సిద్ధు జొన్నలగడ్డ కథానాయకుడిగా, రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లుగా నీరజా కోన దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'తెలుసు కదా'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. సినిమా దీపావళి కానుకగా అక్టోబరు 17న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా తన షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకున్న రాశీ ఖన్నా ఈ చిత్రానికి సంబంధించిన అనుభవాలు పంచుకుంటూ 'ఈ ప్రయాణంలో నాతో నడిచిన చిత్రబృందానికి కృతజ్ఞతలు. మేము సృష్టించిన ఈ ప్రపంచంలోకి మీరు అడుగుపెట్టే రోజు కోసం ఎదురుచూస్తున్నాను. మీకు అద్భుతమైన అనుభూతిని ఇస్తుందీ చిత్రం' అని అన్నారు.

మిరాయ్ ప్రేక్షకులను మెప్పిస్తుంది


ధ్రువ సర్జా

తేజ సజ్జా కథానాయకుడిగా నటించిన సూపర్‌హీరో చిత్రం 'మిరాయ్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. మంచు మనోజ్ ప్రతినాయక పాత్రను పోషించారు. ఈ నెల 12న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం బెంగళూరులో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ముఖ్య అతిథిగా హాజరైన కన్నడ హీరో ధ్రువ సర్జా మాట్లాడుతూ 'ఒక పండగ లాంటి వాతావరణంలో 'మిరాయ్' సినిమా విడుదలవుతోంది. అద్భుతమైన నటీనటులు, టెక్నీషియన్లు ఈ సినిమా కోసం పనిచేశారు. విశ్వప్రసాద్ భారీస్థాయిలో నిర్మించారు. ప్రచార చిత్రాలు అద్భుతంగా ఉన్నాయి. ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుందనే నమ్మకం ఉంది' అని అన్నారు. తేజ సజ్జా మాట్లాడుతూ 'పిల్లలు, పెద్దలు అందరూ కలసి చూసేలా 'మిరాయ్' చిత్రం ఉంటుంది. యాక్షన్‌కి థ్రిల్‌ని మేళవించి తీసిన ఓ మంచి చిత్రమిది. పతాక సన్నివేశాల్లో భావోద్వేగాలు ఆకట్టుకుంటాయి' అని చెప్పారు. విశ్వప్రసాద్ మాట్లాడుతూ 'ధ్రువ సర్జాతో ఓ చిత్రం చేయబోతున్నాం. 'మిరాయ్' చిత్రాన్ని మంచి నిర్మాణ విలువలతో తెరకెక్కించాం' అని తెలిపారు.

శ్రద్ధాంజలి



జననం :
08-01-1964

In Loving Memory of

మరణం :
29-08-2025

కీ॥శే॥ కొల్లి లక్ష్మయ్య చౌదరి (KLC) గారు

కీ॥శే॥ కొల్లి సుమతి గారు

Always in our Hearts

మీరు మాకు అందించిన సేవలు అనిర్వచనీయం...

అలుపెరుగని శ్రమ, మొక్కవోని దీక్ష మాకెల్లప్పుడూ మార్గదర్శకం...

ఆప్యాయతానురాగాలను మాకు పంచిన అమృతమూర్తి... మార్గదర్శిగా ఉజ్వల భవిష్యత్తును అందించారు.

మీరు నేర్పిన ఆదర్శాలతో ముందుకు సాగుతూ... మీ పవిత్ర ఆత్మకు శాంతిని ప్రసాదించమని భగవంతుని ప్రార్థిస్తూ....

కుమార్తెలు - అల్లుళ్ళు

వీరమాచనేని శాంతి
వీరమాచనేని వంశీకృష్ణ
మనవరాలు : జ్ఞాన అభిజ్ఞసాయి
మనవడు : శ్రీ కార్తికేయ హితేష్
రవీంద్రభారతి విద్యాసంస్థలు
ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది

తాతినేని సౌజన్య
తాతినేని గోపినాథ్
మనవడు : శ్రీసత్య దేవాన్ష్
శ్రీ కృష్ణవేణి విద్యాసంస్థలు
ప్రిన్సిపాల్, అధ్యాపక మరియు
అధ్యాపకేతర సిబ్బంది

RAVINDRA BHARATHI PUBLIC SCHOOL
THE GATEWAY TO FUTURE EDUCATION
SCOTSPINE INTERNATIONAL SCHOOL
RAVINDRA BHARATHI'S green SCHOOL
RAVINDRA BHARATHI'S Nextgen CBSE SCHOOL

SRI KRISHNAVENI
EDUCATIONAL INSTITUTIONS
TATINENI NAGAR,
PORANKI, VIJAYAWADA

KALYANI ADS

నేడు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

తుళ్లూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మందడం విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతుల నిమిత్తం సబ్ స్టేషన్ పరిధిలోని మాల్యాపురం, వెలగపూడి, ఉద్దండ్రాయుని పాలెం గ్రామాలలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ ఉమా మహేశ్వరావు ఆదివారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

దుగ్గిరాలలో ఉచిత యోగా శిక్షణా శిబిరం

దుగ్గిరాల, సెప్టెంబరు 7: దుగ్గిరాలలోని శ్రీనాగేశ్వర స్వామి ఆలయం ఆవరణలో ఆదివారం ఉచిత యోగా శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. తెనాలి శ్రీఆంజనేయయోగధ్యానమండలి ఆధ్వర్యంలో కిషోర్‌గురూజీ యోగా శిక్షణను ఇస్తున్నారు. ఈ శిక్షణ ప్రతిరోజూ ఉదయం 5నుంచి 7గంటల వరకు 21 రోజులపాటు కొనసాగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

తాడేపల్లి (కుంచనపల్లి), సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): అమ్మిశెట్టి రామారావు జ్ఞాపకార్థం అమరావతి కంటి ఆసుపత్రి సౌజన్యంతో ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు వేణు నాదెళ్ల, సౌజన్య కేతినేని ఆధ్వర్యంలో ఆదివారం కుంచనపల్లిలోని ఎంపీయూపీ పాఠశాలలో ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కంటికి సంబంధించిన వివిధ రకాల జబ్బులు, శుక్లాల పరీక్షలను వైద్యులు నిర్వహించారు. సుమారు 200మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. శుక్లాలు ఉన్నవారికి ఉచితంగా తమ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆపరేషన్లు చేయనున్నట్టు కొతవరపు పూర్ణ చెప్పారు. కార్యక్రమంలో అమ్మిశెట్టి శివ, వైద్యులు కొతవరపు రాజేశ్, మండ్రు విజయకుమార్, అమ్మిశెట్టి సురేశ్, అమ్మిశెట్టి శ్రీలక్ష్మి, అమ్మిశెట్టి శివనాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

15న జరిగే చలో విజయవాడను జయప్రదం చేయాలి

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమబోర్డును పునర్నిర్మించాలని కోరుతూ ఈ 15న నిర్వహించే చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కోరారు. స్థానిక సుందరయ్యనగర్‌లో భవన నిర్మాణ కార్మిక సంఘ ఏరియా సమావేశం వలి నాగరాజు అధ్యక్షతన ఆదివారం జరిగింది. సమావేశంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగేశ్వరరావు, దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, కార్యక్రమంలో సుందరయ్యనగర్‌లోని భవన నిర్మాణకార్మికులు పాల్గొనాలని కోరారు. సీఐటియూ నేతలు వేముల దుర్గారావు మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న క్లయిమ్‌లను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో బాలకృష్ణారెడ్డి, భద్రయ్య, తిరుపాలు, హజరత్, ఎం.దుర్గారావు, అబీస్ బర్నే, లింగమూర్తి స్వామి, శేషగిరిరావు, మస్తాన్‌రావు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కాకుమాను, సెప్టెంబరు (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరుగుతుందని తహసీల్దార్ వెంకటస్వామి ఆదివారం తెలిపారు. దీనికి మండలస్థాయి అధికారులు హాజరవ్వాలని ఆదేశించారు.

చెదరని ముద్రగా జగన్ చీకటి చరిత్ర..

జగన్ చీకటి చరిత్ర చెదరని ముద్రగా చరిత్రలో నిలిచిపోతుందని సంగం డెయిరీ మాజీ చైర్మన్ కొల్లా వీరయ్య చౌదరి అన్నారు. బ్లాక్ మార్కెట్ నుంచి వచ్చే కమీషన్‌లకు కక్కుర్తిపడి గతంలో సులభంగా దొరికే యూరియాను రైతులకు అందకుండా చేసిన ఘనత జగన్‌దని, అలాంటి వ్యక్తి ఇప్పుడు యూరియా గురించి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. రూ.43వేల కోట్లు ప్రజాధనాన్ని దోచి 16 నెలలు రిమాండ్ ఖైదీగా ఉన్న జగన్.. చంద్రబాబుపై అవినీతి ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

జాబ్ క్యాలెండర్‌పై మాట తప్పిన ప్రభుత్వం



అంబేడ్కర్ సెంటరులో నిరసన తెలుపుతున్న ఏఐవైఎఫ్ నేతలు

మంగళగిరి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పి కూటమి ప్రభుత్వం మాట తప్పిందని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ వలి విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఆదివారం మంగళగిరి తాలూకా సెంటరులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వలి మాట్లాడుతూ, రాష్ట్రంలో ఖాళీగా వున్న 2.30 లక్షల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వాలని, నిరుద్యోగ భృతి వాగ్దానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి జాలాది నవీన్, నేతలు ఇంటూరి గోపిరాజు, జీ.త్రిలోక్, డి.సిరాజ్, జే.శామ్యూల్, జే.వెంకట నరేంద్ర, ఐ.అశోక్‌తేజ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట

పెదనందిపాడు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని మాజీ ఎంపీపీ నర్ర బాలకృష్ణ అన్నారు. స్థానిక శాలివాహన కాలనీలో నూతనంగా నిర్మించిన సీసీ రహదారులను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉన్నా ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ, అభివృద్ధి కుంటుపడకుండా కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో శాలివాహన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శివనారాయణ, పిడితల నాగమల్లేశ్వరరావు, సహాయ కార్యదర్శి బాపనపల్లి శివరామ్, జిల్లా యువజన అధ్యక్షుడు మామిళపల్లి సుబ్బారావు, మండల అధ్యక్షుడు నిజాంపట్నం సుబ్బారావు, మార్కెట్‌యార్డు డైరెక్టర్ చాగంటి సత్యహర్ష, షేక్ కలీం, కొల్లా బుచ్చయ్య చౌదరి, శ్రీనివాసరావు చల్లగిరి, సామ్రాజ్యం, ఫకీర్ రావు, తదితరులు పాల్గొన్నారు.


సీసీ రహదారిని ప్రారంభిస్తున్న నర్రా బాలకృష్ణ

చేతులెత్తేసిన సచివాలయ సిబ్బంది

● స్మార్ట్ కార్డుల పంపిణీ చేయకుండా రేషన్ డీలర్లకు అప్పగింత
● రేషన్‌షాపుల చుట్టూ తిరుగుతున్న కార్డుదారులు
● తమ కార్డు ఏ షాపులో ఉందో తెలియక తికమక


తాడికొండలో స్మార్ట్ కార్డుల కోసం రేషన్ డిపో వద్ద పడిగాపులు కాస్తున్న కార్డుదారులు

తాడికొండ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన స్మార్ట్ కార్డుల పంపిణీని సచివాలయ సిబ్బంది తమకు సంబంధం లేదంటు చేతులెత్తేయడంతో ప్రజలు కార్డుల కోసం రేషన్ షాపుల చుట్టూ తిరుగుతున్నారు. పౌరసరఫరాలశాఖ నూతనంగా రేషన్‌కార్డుల ప్లేసులో స్మార్ట్‌కార్డులను తీసుకొచ్చింది. ఈ కార్డుల పంపిణీని గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి అప్పగించింది. ఇంటింటికి తిరిగి స్మార్ట్ కార్డులు పంపిణీ చేసే సమయంలో రేషన్ డీలర్ల సహాయాన్ని తీసుకోవాలని పౌరసరఫరాలశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీన్నే సచివాలయ సిబ్బంది తమకు అనుకూలంగా మార్చుకొని రేషన్‌డీలర్లకు స్మార్ట్ కార్డుల జారీని అప్పగించి చేతులు దులుపుకున్నారు. సెప్టెంబరు 5వ తేదీ వరకు ఇంటింటికీ తిరిగి తూతుమంత్రంగా పంపిణీ చేసి చేశారు. స్మార్ట్ కార్డుల పంపిణీకి తమకు ఇచ్చిన తేదీ అయిపోయిందని, రేషన్ డీలర్లకు కార్డులను అప్పగించేసి చేతులెత్తేసారు. తాడికొండ మండలంలో 22,483 స్మార్ట్ కార్డులు ఉండగా సచివాలయ సిబ్బంది సెప్టెంబరు 6వ తేదీ వరకు 3,583 కార్డులు పంపిణీ చేశారు. రేషన్ డీలర్లు 7,397 కార్డులను పంపిణీ చేశారు. తుళ్లూరు మండలంలో ఉన్న 19,642 స్మార్ట్‌కార్డుల్లో సచివాలయ సిబ్బంది 581 కార్డులు పంపిణీ చేయగా రేషన్ డీలర్లు 10,945 పంపిణీ చేశారు. ఫిరంగిపురంలో 20,383 కార్డులకు సచివాలయ సిబ్బంది 314 కార్డులు మాత్రమే పంపిణీ చేశారు. డీలర్లు 8,092 కార్డులు పంపిణీ చేశారు. మేడికొండూరు మండలంలో 18,894 స్మార్ట్ కార్డులు ఉండగా 2,369 కార్డులు సచివాలయ సిబ్బంది పంపిణీ చేయగా 6,399 కార్డులు రేషన్ డీలర్లు పంపిణీ చేశారు. సోమవారం సీసీఎల్ అధికారులతో మీటింగ్ ఉందనే కారణంతో స్మార్ట్‌కార్డుల పంపిణీని వేగవంతం చేయాలని పౌరసరఫరాల అధికారులు ఆదేశాలు జారీ చేశారు. రేషన్ డీలర్లు ఇప్పటికే రేషన్ పంపిణీ చేస్తుండగా మరో వైపు స్మార్ట్‌కార్డుల పంపిణీ ఎలా చేస్తామని ఆవేదన వ్యక్తం చేశారు. స్మార్ట్ కార్డుల కోసం రేషన్ షాపు వద్ద కార్డుదారులు పడిగాపులు కాస్తున్నారు. రేషన్ పంపిణీ చేయాలో, స్మార్ట్ కార్డులు పంపిణీ చేయాలో తెలియక రేషన్ డీలర్లు అయోమయంలో ఉన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్మార్ట్ కార్డులను సచివాలయ సిబ్బందితో పంపిణీ చేయిస్తే బాగుంటుందని రేషన్‌కార్డు దారులు కోరుతున్నారు.

ప్రజలకు శాస్త్ర విజ్ఞానాన్ని చేరువ చేయాలి

● మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): శాస్త్ర విజ్ఞానాన్ని ప్రజలకు చేరువ చేయాలనే లక్ష్యంతో జన విజ్ఞాన వేదిక పనిచేస్తుందని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు చెప్పారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా 18వ మహాసభ మంగళగిరి ఎస్ఎల్ఎం చైతన్య హైస్కూల్ ఆవరణలో ఆదివారం జరిగింది. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు టీ.జాన్‌బాబు అధ్యక్షతన జరిగిన సభలో లక్ష్మణరావు మాట్లాడుతూ, సమాజంలో మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా శాస్త్రీయ దృక్పథంతో 37 సంవత్సరాల కిందట జనవిజ్ఞాన వేదిక ఏర్పాటైందన్నారు. అశాస్త్రీయ భావాలను ప్రభుత్వాలు అమలు చేస్తున్న తరుణంలో జనవిజ్ఞాన వేదిక ప్రాధాన్యత పెరిగిందని చెప్పారు. ఈ క్రమంలో జనవిజ్ఞాన వేదిక కార్యకలాపాలను మరింత విస్తృతం చేయాలని సూచించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన విద్యార్థులు 88 శాతం మంది చదువుతున్నారని, అలాంటి విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు పాలకులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సమాజంలో జరిగే అన్ని అంశాలపై శాస్త్రీయ దృక్పథంతో ముందుకు సాగి ప్రజలను చైతన్యవంతం చేయాలని పిలుపునిచ్చారు. డాక్టర్ ఏవీఎస్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ, సమాజ రుగ్మతలకు వ్యతిరేకంగా శాస్త్రీయ ఆలోచనలను ప్రజల్లో పెంపొందించడానికి కృషి చేయాలని కోరారు. ఈ మహాసభలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి కే.రామారావు, జిల్లా కార్యదర్శి బి.ప్రసాద్, ప్రజా సంఘాల నాయకులు టీ.శ్రీనివాసరావు ప్రొఫెసర్ వేణుగోపాల్, డాక్టర్ కేవీఎస్ సాయిప్రసాద్, వీవీ ప్రసాద్, యూ.రాజశేఖర్, డి.బుజ్జిబాబు, అహ్మద్ హుస్సేన్, టీ.ఆంజనేయులు, ఎ.శ్రీనివాసరావు, ఎస్.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన టీ.ఆంజనేయులు, సీహెచ్ ఆదినారాయణ, ఎస్.శ్రీనివాసరావు తదితరులను ఘనంగా సన్మానించారు.

జేవీవీ జిల్లా కమిటీ ఎన్నిక

మహాసభ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా కేఎస్ లక్ష్మణరావు, టీ.రత్నారావు, డాక్టర్ ఏఎస్‌వీఎన్ ప్రసాద్, ప్రొఫెసర్ వేణుగోపాలరావు, అధ్యక్షుడిగా ఎం.ఉదయ భాస్కర్, ఉపాధ్యక్షులుగా బి.ప్రసాద్, టీఆర్ రమేష్, ఆర్.స్వాతి, షేక్ అహ్మద్ హుస్సేన్, కోశాధికారిగా జీ.వెంకట రామారావు, ప్రధాన కార్యదర్శిగా టీ.జాన్‌బాబు, కార్యదర్శులుగా రాము, వి.ప్రసాద్, కే.వెంకటేశ్వరరావు, టీ.భాస్కరరావు, ఈ.అనిల్‌కుమార్, గోకుల్ చంద్‌లను ఎన్నుకున్నట్టు ప్రకటించారు.

రైతులకు సకాలంలో ఎరువులివ్వాలి

● సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎరువులు, రసాయనాలు, యూరియా సకాలంలో పంపిణీ చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళగిరి సీపీఐ కార్యాలయంలో ఆదివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ, ప్రతి ఏటా ఎరువుల కొరత కారణంగా రైతులు నల్ల బజారుకు బలవుతున్నారని చెప్పారు. రైతు అవసరాలు, సాగు ప్రాంతాల దృష్ట్యా ఎరువులు కోటాను సమయానుకూలంగా కేటాయించాలని కోరారు. మంగళగిరి తహసీల్దారు కార్యాలయం ఎదుట సోమవారం జరిగే నిరసనలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు, నేతలు పీ.సాంబశివరావు, టీ.నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

శివ భక్త బృందం ఆధ్వర్యంలో అన్నదానం

మంగళగిరి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మంగళగిరి శివాలయం సమీపంలోగల శ్రీరత్నగర్భ సిద్ధి గణపతి దేవాలయం వద్ద ఆదివారం శివభక్త బృందం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. రామాంజనేయులు బ్రదర్స్, దాతల సహకారంతో గత 33 సంవత్సరాల నుంచి ప్రతి నెలా అమావాస్య ముందొచ్చే ఆదివారం రోజున అన్నదానం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమంలో మంగళగిరి మార్కెట్ యార్డు మాజీ వైస్‌చైర్మన్ మన్నెం రమేశ్‌బాబు, శివభక్త బృందం ప్రతినిధులు కాండ్రు దుర్గాశ్రీనివాసరావు, గుండా రామాంజనేయులు, అన్నపురెడ్డి రామకృష్ణారెడ్డి, యడ్ల గురునాథం, ఆంజనేయప్రసాద్, అవ్వారు వెంకటేశ్వరరావు, పంచల శివన్నారాయణ, కుర్రి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ


ఉపకార వేతనాలను పంపిణీ చేస్తున్న సీనియర్ వాహనాల తనిఖీ అధికారి నంబూరి శివనాగేశ్వరరావు

పెదనందిపాడు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో పెదనందిపాడు ఎడ్యుకేషన్ చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రతిభగల పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. నర్సరావుపేట సీనియర్ వాహన తనిఖీ అధికారి నంబూరి శివనాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ, విద్యార్థుల పట్ల వారి తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలన్నారు. నేటి యువత విద్యతోపాటు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదిగి తోటివారికి సహాయం అందించాలని కోరారు. అనంతరం 87మంది విద్యార్థులకు 6.40లక్షల నగదు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు దాసరి శేషగిరిరావు, అరవపల్లి కృష్ణమూర్తి, కోశాధికారి ముద్దన రాఘవయ్య, గేరా రత్నం, దొప్పలపూడి రమేశ్‌బాబు, దాసరి చంద్రశేఖర్, కాకరపర్తి రమేశ్, సభ్యులు పాల్గొన్నారు.

చేనేతకు రూ.1000 కోట్లు కేటాయించాలి



మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ


మంగళగిరి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో చేనేతకు రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ డిమాండ్ చేశారు. చేనేత కార్మిక సంఘం పట్టణ 9వ మహాసభ రత్నాల చెరువులోని సింహాద్రి శివారెడ్డి భవన్‌లో ఆదివారం జంజనం శివభావన్నారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ, పాలకులు అవలంబిస్తున్న కార్పొరేట్ విధానాల వల్ల చేనేత పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయిందని, నమ్ముకున్న వృత్తిని వదులుకోలేక మరో వృత్తిలోకి వెళ్లలేక కార్మిక కుటుంబాలు అర్ధాకలితో అలమటిస్తున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. చేనేతపై జీఎస్టీని పూర్తిగా రద్దు చేయాలని, 20 శాతం రిబేటు సంవత్సరం మొత్తం కొనసాగించాలని కోరారు. నేతన్న నేస్తం మగ్గం నేస్తున్న ప్రతి కార్మికుడికి ఇవ్వాలని, బోగస్ చేనేత సహకార సంఘాలను రద్దు చేయాలని అన్నారు. చేనేత కార్మికులకు మూడు సెంట్ల స్థలంలో మగ్గం షెడ్డుతో కూడిన ఇల్లు నిర్మించి ఇవ్వాలని, 11 రకాల చేనేత రిజర్వేషన్లను కఠినంగా అమలుజరపాలని బాలకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మహాసభలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈమని అప్పారావు, సీఐటీయూ నేత ఎస్ఎస్ చెంగయ్య తదితరులు పాల్గొన్నారు. చేనేత కార్మిక సంఘం పట్టణ అధ్యక్షుడిగా డోకుపర్తి రామారావు, ఉపాధ్యక్షుడిగా గోలి దుర్గాప్రసాద్, కార్యదర్శిగా సాదు నరసింహారావు, సహాయ కార్యదర్శిగా ఎం.శివచంద్రరావు తదితరులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

ఇబ్రహీంకు పలువురు నేతల అభినందన


మహమ్మద్ ఇబ్రహీంను సన్మానిస్తున్న మన్నెం రమేష్‌బాబు

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టరుగా నియమితులైన మహమ్మద్ ఇబ్రహీంను ఆదివారం పలువురు నేతలు కలిసి అభినందనలు తెలియజేశారు. ఇబ్రహీంను శాలువాతో సత్కరించి బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ వైస్‌చైర్మన్ మన్నెం రమేష్‌బాబు మాట్లాడుతూ, ఇబ్రహీం ఆనాడు ఎన్టీఆర్ అభిమాన సంఘం నాయకుడిగా వుండి, ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీలో చేరి నేటి వరకు పార్టీ కోసం అంకితభావంతో పనిచేశారని చెప్పారు. రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పోస్టులో మంగళగిరి ప్రాంతానికి పెద్ద పీట వేస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. కాగా, ముస్లిం యువతరం నాయకులు ఇబ్రహీంను కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువతరం అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్ అలీ, అన్వర్, న్యాయవాది షౌకత్, యువతరం నేతలు గల్ఫ్ సుభాని, భాసిత్, షేక్ జానీ, రషీద్, రఫీ, జిలానీ, అన్వర్, టీడీపీ నేతలు జమ్ముల శ్రీనివాసరావు, రంగిశెట్టి పెద్దబ్బాయ్, ఇస్మాయిల్, ఎండీ రఫీ తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణ హైస్కూల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

తాడేపల్లి (ప్రాతూరు), సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిలోని సీతానగరం శ్రీరామకృష్ణ హైస్కూల్ 1986-87 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల 2వ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పాతూరు రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. నాడు పాఠశాలలో చదివిన దాదాపు 50 మంది విద్యార్థులు ఈ సమ్మేళనానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా తమ గురువులను వారు తలుచుకున్నారు. 38 సంవత్సరాల క్రితం జ్ఞాపకాలను నెమరువేసుకొని ఉల్లాసంగా ఆడిపాడారు. ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. పూర్వ విద్యార్థులు బి చందు, డి రామకృష్ణారెడ్డి, సీతారెడ్డి, నాగరాజు, మధు, ఉష, ఉదయలక్ష్మి, కొండమ్మ, తదితరుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

పెనుమాకలో రూ.1.20 లక్షలకు లడ్డూ వేలం


తాడేపల్లి(పెనుమాక), సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండల పరిధిలోని పెనుమాకలో ఆర్‌సి యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయకచవితి వేడుకల్లో శనివారం గణేషుని ఊరేగింపు సందర్భంగా లడ్డూ వేలంపాట నిర్వహించారు. ఈ వేలంపాటలో పెనుమాకకు చెందిన కొల్లి సురేశ్ 30కేజీల లడ్డూను రూ.1,20,000కు కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సి యూత్ కమిటీ సభ్యులు మండల తెలుగుయువత నాయకులు గ్రామస్థులు మహిళలు పాల్గొన్నారు.

తాడేపల్లిలో రూ.1,11,116..

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గణనాధుని నిమజ్జనోత్సవం సందర్భంగా తాడేపల్లి బైపాస్‌లోని నారా లోకేశ్ క్రీడాప్రాంగణంలో శనివారం వినాయకుని లడ్డూ వేలంపాట జరిగింది. వేలంపాటలో పాతూరు గ్రామ టిడిపి అధ్యక్షుడు అరవపల్లి శ్రీనివాస్ రూ.1,11,116లకు లడ్డూను దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమి చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, కోమటి జయరాం, ముమ్మడి సత్యనారాయణ, పట్టణ టిడిపి అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు, గోర్ల వేణుగోపాల్‌రెడ్డి, అరవపల్లి శ్రీనివాస్, వేమూరి రవి, కోగంటి ప్రసాద్, ప్రజాంభన, మండవ గోపాలరావు, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, మొవ్వ నారాయణ, కొడాలి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బైబై గణేశా..!

దుగ్గిరాల: మండలంలో వినాయక నిమజ్జనోత్సవాలు ఘనంగా జరిగాయి. దుగ్గిరాల, చిలువూరు, పెదకొండూరు గ్రామాల్లో ఏర్పాటు చేసిన భారీ విగ్రహాలకు నిమజ్జనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. నిమజ్జనాలు చేసే కాల్వలు, వంతెనలు, లాకుల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు.


ప్రకాశం బ్యారేజి దిగువకు విడుదల అవుతున్న కృష్ణానది వరదనీరు

ప్రకాశం బ్యారేజి నుంచి 43,500 క్యూసెక్కుల నీటి విడుదల

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి ఆదివారం 43,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యారేజీ ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టుతోపాటు, కీసర, మున్నేరు, వెలగలేరు, తదితర ప్రధాన వాగుల నుంచి 62,449 క్యూసెక్కుల వరదనీరు బ్యారేజీకి ఇన్‌ఫ్లోగా వచ్చి చేరుతున్నట్లు ఇరిగేషన్ జేఈ రాజేశ్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం నమోదవుతుండగా దిగువకు 43,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు చెప్పారు. తూర్పు డెల్టా కాలువకు 10,486 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 8,216 క్యూసెక్కులు, గుంటూరు చానల్‌కు 247 క్యూసెక్కుల నీటి విడుదల చేస్తున్నట్లు జేఈ రాజేశ్ తెలిపారు.

పశ్చిమడెల్టాకు 8,216 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమడెల్టాకు 8,216 క్యూసెక్కుల నీటిని ఆదివారం విడుదల చేశారు. ప్రస్తుతం బ్యారేజి వద్ద 12 అడుగుల నీటిమట్టం ఉండగా దిగువకు 53,400 క్యూసెక్కులనీటిని విడుదల చేస్తున్నారు. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ చానల్‌కు 340 క్యూసెక్కులు, రేపల్లెకాల్వకు 1930 క్యూసెక్కులు, తూర్పుకాల్వకు 720 క్యూసెక్కులు, పశ్చిమకాల్వకు 241 క్యూసెక్కులు, నిజాంపట్నంకాల్వకు 454 క్యూసెక్కులు, కొమ్మమూరుకాల్వకు 3,420 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ప్రభుత్వ హామీలను నెరవేర్చాలి

ప్రత్తిపాడు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియర్ జిల్లా అధ్యక్షురాలు కుమారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సమావేశం స్థానిక అక్షయ విద్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం సమ్మెకాలంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు.

ప్రత్తిపాడు ప్రాజెక్టు నూతన కమిటీ ఎన్నిక

ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టుకు సంబంధించి యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా కే పద్మ, కార్యదర్శిగా పీ ప్రేమలత, కోశాధికారిగా నాగరాజకుమారి, ఉపాధ్యక్షులుగా సుభాషిని, శివపార్వతి, ధనలక్ష్మి, శ్రీవాసవి, నవరత్నమణి, సహాయ కార్యదర్శులుగా విజయ, శశికళ, శ్రీదేవి, నవనీతం, స్వాతి, సభ్యులుగా 15 మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బీ లక్ష్మణరావు, అంగన్వాడీ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు జీ రమణ తదితరులు పాల్గొన్నారు.

మహంకాళీ అమ్మవారి ఆలయం మూసివేత


కేఆర్‌కొండూరులోని శ్రీమహంకాళీ అమ్మవారి ఆలయాన్ని మూసివేస్తున్న దృశ్యం

దుగ్గిరాల, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం కారణంగా కేఆర్‌కొండూరు శ్రీమహంకాళీ అమ్మవారి ఆలయాన్ని ఆదివారం మధ్యాహ్నం కవాటబంధనం చేసి మూసివేశారు. ఆలయంలో అమ్మవారికి నైవేద్యం సమర్పించిన అనంతరం అర్చకులు మూసివేశారు. సోమవారం ఉదయం ఆలయ సంప్రోక్షణ అనంతరం ఆలయాన్ని తెరుస్తామని, భక్తులు యథావిధిగా అమ్మవారిని దర్శించుకోవచ్చునని ఈఓ కోగంటి సునీల్ తెలిపారు.

మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

తాడేపల్లి (వడ్డేశ్వరం), సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, ఆప్కాస్ రద్దును విరమించుకోవాలని సీఐటీయూ జిల్లా నాయకుడు వై నేతాజీ డిమాండ్ చేశారు. ఆదివారం వడ్డేశ్వరం జాతీయ రహదారి వద్ద ఉన్న కేబీ భవన్‌లో తాడేపల్లి మండల మున్సిపల్ పారిశుధ్య కార్మికుల విస్తృత స్థాయి సమావేశం సంఘం మండల అధ్యక్షుడు చొక్కా మరియదాసు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా నేతాజీ మాట్లాడుతూ, పని ఎక్కువగా ఉన్నచోట కార్మికుల సంఖ్యను పెంచాలని కోరారు. రూ.26 వేల కనీస వేతనాన్ని పారిశుధ్య కార్మికులకు ఇవ్వాలని అన్నారు. 2023 సమ్మె అనంతరం పారిశుధ్య కార్మికులకు రావాల్సిన రూ.6వేల హెల్త్ అలవెన్స్‌లు ఇప్పటి వరకు అందకపోవడం అన్యాయమని నేతాజీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, మండల పారిశుధ్య కార్మికుల సంఘం కార్యదర్శి మేకల డేవిడ్, కృష్ణతులసి, ప్రసన్నకుమార్, ఉషారాణి, జయంతి, వెంకటేశ్వర్లు, జోజిబాబు, నూతక్కి సుధాకర్, రాంబాబు, ఇస్సాకు పాల్గొన్నారు.

సుంకాల పెంపునకు వ్యతిరేకంగా నిరసన

మంగళగిరి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతీకార సుంకాలను 50శాతం పెంచడాన్ని వ్యతిరేకిస్తూ సీపీఎం రాజధాని డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళగిరి మండలం నిడమర్రు గ్రామంలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నేత ఎం.రవి మాట్లాడుతూ, రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేస్తుందనే నెపంతో భారత్ మీద ప్రతీకార సుంకాలను విధించామని ట్రంప్ చెప్పడాన్ని భారతీయులందరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. దీనివల్ల భారత్ నుంచి ఎగుమతి చేసే ఉత్పత్తుల ధరలు ఘోరంగా పడిపోయాయన్నారు. ప్రతీకార సుంకాల పేరుతో ట్రంప్ భారత ఆర్థిక ప్రయోజనాలకు ఆటంకం కలిగిస్తుంటే ప్రధాని మోదీ నోరు మెదపడంలేదని విమర్శించారు. ఇప్పటికే ట్రంప్ భారత్‌పై అదనపు సుంకాలు విధించడం వల్ల అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువ దారుణంగా పడిపోయిందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు ఎం.భాగ్యరాజు, గైరబోయిన నాగేశ్వరరావు, కట్టెపోగు నాగేశ్వరరావు, కైలా స్టాలిన్, బుల్లెబ్బాయి, మంచికలపూడి కోటేశ్వరరావు, కుంపటి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

కాటూరి మెడికల్ క్యాంపు విజయవంతం

ఫిరంగిపురం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఫిరంగిపురంలో ఆదివారం కాటూరు మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరం విజవంతంగా ముగిసింది. తాడికొండ నియోజకవర్గ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ పర్యవేక్షణలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మండవ నరసింహారావు సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. వైద్య బృందం రోగు పరీక్షలు జరిపి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మండవ నరసింహారావు, పట్టణ అధ్యక్షులు కటికల అప్పారావు, పసల థామస్, పీ హృదయరాజు, ఆరెపు న్నారెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.


మెడికల్ క్యాంపును రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న మండల టీడీపీ అధ్యక్షుడు మండవ నరసింహారావు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

తెనాలి అర్బన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం గౌతమ్ గ్రాండ్‌లో నిర్వహించారు. వీఎస్ఆర్ అండ్ ఎన్వీఆర్ కళాశాలలో 1983-86లో జియాలజీ చదివిన విద్యార్థులు నాలుగు దశాబ్దాల అనంతరం కలుసుకున్న విద్యార్థులు చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు సీతారామయ్య, సుబ్బారావులను సత్కరించారు. కార్యక్రమాన్ని సుభాష్‌బాబు, చలపతిరావు, వేణు, పద్మలత తదితరులు పర్యవేక్షించారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

గేదెలకు విషపు గుళిక పెట్టిన వ్యక్తిపై కేసు

తెనాలి క్రైం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గేదెలకు విషపు గుళికలు పెట్టి వాటిని చంపడానికి ప్రయత్నించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు త్రీ టౌన్ పోలీసులు ఆదివారం తెలిపారు. స్థానిక చెంచుపేట కుమార్ పంప్స్ ఎదురు వీధిలో గంధం కృష్ణ తన ఖాళీ స్థలంలో చావిడి వేసుకుని గేదెలను పోషించుకుంటున్నాడు. దీనికి సమీపంలో నివాసం ఉంటున్న సాతా వీరశంకర్ పశువుల పేడ వాసన వస్తోందని వాటిని తొలగించాలని గతంలో మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. వారు సర్ది చెప్పారు. ఇటీవల గంధం కృష్ణకు చెందిన గడ్డి వాములను తగలబెట్టడమే కాకుండా కొద్ది రోజుల క్రితం మేతకు వెళ్లిన పశువులకు సాతా వీరశంకర్ విషపు గుళికలు పెట్టాడని గంధం కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు త్రీ టౌన్ పోలీసులు తెలిపారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

తెనాలి క్రైం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తనను భర్త వేధింపులకు గుర్తి చేస్తున్నాడని ఒక యువతి ఆదివారం వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం ప్రేమించుకుని ఆరు నెలల క్రితం కులాంతర వివాహం చేసుకున్నామని, తనను భర్త, అత్తమామలు కలిసి వేధింపులకు గురి చేస్తున్నారని జాహ్నవి అనే యువతి ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయిని ఉమాదేవికి సన్మానం

తెనాలి అర్బన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు గ్రహీత డి.ఉమాదేవిని ఆదివారం ఘనంగా సన్మానించారు. జగ్గడిగుంటపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె విద్యాభివృద్ధికి చేసిన కృషిని పలువురు కొనియాడారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కళాధర్, హనుమంతరావు, వరప్రసాద్, కేదార్‌నాథ్, కాలేషావలి, కామాక్షి, ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణం కోసం మొక్కలు నాటాలి: విన్సెంట్

తెనాలి అర్బన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని చెంచుపేట నిత్యసహాయ మాత ఆలయ ఫాదర్ విన్సెంట్ చెప్పారు. చర్చి ఆవరణలో ఆదివారం మొక్కలు నాటారు. ఫాదర్ స్లీవా, విజయ్‌కుమార్, ఎస్ఎస్ఎం యువకులు పాల్గొన్నారు.

మాథ్స్‌లెక్చరర్‌కు బెస్ట్ టీచర్ అవార్డు

చేబ్రోలు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు సూర్యదేవర నరసయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాథ్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్న బి.లక్ష్మణరావు గుంటూరు జిల్లా జూనియర్ కళాశాలల విభాగంలో రాష్ట్రస్థాయి బెస్ట్ టీచర్ అవార్డును రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నుంచి అందుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం ధూళిపాళ్ల ఎకనామిక్ అండ్ రూరల్ ఎడ్యుకేషన్ డెవలప్మెంట్ సొసైటీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, ఆర్గనైజర్ యాసిన్ బాబా అభినందనలు తెలియజేశారు.

ఆస్టియో పోరోసిస్‌పై చికిత్స కంటే జాగ్రత్త పడటమే ముఖ్యం

● సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ కొల్లి

గుంటూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆస్టియో పోరోసిస్ వ్యాధి చికిత్స కంటే రాకుండా జాగ్రత్త పడటమే ముఖ్యమని సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కొల్లి జయకిషన్ పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఆరోగ్యసభలో ఆయన ప్రసంగించారు. ఆస్టియో పోరోసిస్ వ్యాధితో చిన్న దెబ్బలకే ఎముకలు విరిగిపోవటం, కొంత మందికి వెన్నపూసలు, పక్కటెముకలు సైలెంట్‌గా ఫ్రాంక్చర్ అవుతాయన్నారు. ఆహారంలో కాల్షియం, విటమిన్ డీ ఉండే ఆహార పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, టీవీ సాయిరామ్, రామచంద్రరావు, చల్లా అంజిరెడ్డి తదితరులున్నారు.

గ్రామాల్లో విజృంభిస్తున్న విష జ్వరాలు

ఆందోళన చెందుతున్న గ్రామస్థులు



కొల్లిపరలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న రోగులు

కొల్లిపర, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. టైఫాయిడ్ ... మలేరియా... డెంగీ జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారు. విష జ్వరాలు రావడంతో పాటు కాళ్లు, చేతులు, కీళ్లు పట్టుకుపోయి మంచానపడుతున్నారు. జ్వరం వచ్చిన తర్వాత వారం రోజుల పాటు తగ్గకపోవడంతో గ్రామాల ప్రజలు మరింత ఆందోళనకు గురవుతున్నారు. కొంత మందికి మలేరియా, టైఫాయిడ్, డెంగీ వ్యాధి లక్షణాలు కనిపించడంతో ఇప్పటికే ప్రైవేటు వైద్యశాలల్లో వైద్యం చేయించుకుంటున్నారు. ప్లేట్‌లెట్ల సంఖ్య పూర్తిగా పడిపోవడంతో రోగులను కుటుంబ సభ్యులు ప్రైవేటు వైద్యశాలలకు తరలిస్తున్నారు. విష జ్వరాలు తగ్గకపోవడంతో ప్రైవేటు వైద్యశాలల్లో వేలాది రూపాయలు ఖర్చు చేయవలసి వస్తుందని గ్రామస్థులు వాపోతున్నారు. మండలంలోని వల్లభాపురం, మున్నంగి, పిడపర్రు, కొల్లిపర, దావులూరు, చెముడుబాడు తదితర గ్రామాల్లో విష జ్వరాలు అదుపుకాక గ్రామస్థులలో భయాందోళనలు నెలకొన్నాయి. ఇటీవల మండల పరిధిలోని తూములూరులో శొంటి సాయిరామహేంద్ర (27) విషజ్వరంతో మృతిచెందాడు. దీనికి తోడు తూములూరులో డెంగీ కేసును వైద్యులు గుర్తించడంతో గ్రామస్థుల్లో భయాందోళనలు పెచ్చుమీరాయి. ప్రస్తుతం గ్రామంలో విషజ్వరాలు విజృంభించడంతో మరింత ఆందోళన చెందుతున్నారు. జ్వరం వచ్చిన వెంటనే కుటుంబ సభ్యులు భయపడి రోగులను ప్రైవేటు వైద్యశాలలకు తరలిస్తున్నారు. అయితే వైద్యాధికారుల సేవలు మాత్రం అంతంత మాత్రంగా ఉండటంతో జ్వరాలు అదుపులోకి రావడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. మండలంలోని గ్రామాల్లో 15 రోజుల నుంచి విష జ్వరాలు తగ్గకపోవటంతో పలువురు వైద్యాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో వైద్యసేవలు సక్రమంగా లేక విష జ్వరాలు విజృంభిస్తున్నాయని ఆరోపణలు చేస్తున్నారు. దగ్గు, జలుబు, తలనొప్పితో మొదలై ఒక్కసారిగా జ్వరం వచ్చి మంచం పడి వారం పదిరోజులు తగ్గకపోవడంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. దీంతో కొందరు భయపడి జ్వరం రాగానే కుటుంబ మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు హాస్పటల్స్‌కు తరలిస్తున్నారు. దీంతో ఆర్థికభారంతో అప్పులపాలవుతున్నారు. దీనిపై ప్రభుత్వం, అధికారులు దృష్టిసారించి గ్రామాల్లో వైద్యసేవలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



చాతుర్మాస్య మహావ్రత కార్యక్రమంలో పాల్గొన్న సాధువులు

అర్ధ చాతుర్మాస్య వ్రత దీక్ష విరమణ

తెనాలి క్రైం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చాతుర్మాస్య వ్రత దీక్ష విశిష్టత గురించి పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామి) ఆదివారం స్థానిక గంగానమ్మపేట మర్చంట్స్ అసోసియేషన్ హాలులో జరిగిన కార్యక్రమంలో భక్తులకు వివరించారు. అర్ధ చాతుర్మాస్య వ్రత దీక్ష విరమణ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో శరణాగతి గోష్టి పీఠాధిపతి శ్రీనరేంద్రస్వామిజీ, అఖిల భారత ఆర్యవైశ్య కమిటీ అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లులతో పాటు పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు నంబూరు వెంకటకృష్ణమూర్తి, రావూరి సుబ్బారావు, ముద్దాభక్తుని రమణయ్య, పి.మురళీమనోహర్, గోపు రామకృష్ణ, రాజేశ్వరరావు, జయలక్ష్మి, సాలిగ్రామ మఠం, శ్రీవిద్యా పీఠం సభ్యులు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



సురేష్‌ను సన్మానిస్తున్న వాసవి, స్వర్ణపూరి కపుల్స్ క్లబ్ నిర్వాహకులు

సమాజాభివృద్ధికి చేయూత అందించాలి

● వాసవి స్వర్ణపురి కపుల్స్ క్లబ్ అధ్యక్షుడు పోలిశెట్టి వెంకట సుబ్బారావు

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సమాజాభివృద్ధికి తమవంతు చేయూతనందించాలని వాసవి స్వర్ణపురి కపుల్స్ క్లబ్ అధ్యక్షుడు పోలిశెట్టి వెంకట సుబ్బారావు అన్నారు. గత వారం రోజులుగా వాసవి స్వర్ణపురి కపుల్స్ క్లబ్ ఆధ్వర్యంలో పలు రంగాలలో సేవలందించిన వారికి సన్మాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం జరిగిన కార్యక్రమంలో వాసవి క్లబ్ నిర్వాహకులు మాట్లాడుతూ సమాజ సేవలో వాసవి క్లబ్ ముందుంటుందని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పాదర్తి వెంకట సుబ్బాయ్య, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



అన్నదాత పోరు పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే శివకుమార్

రేపు వైసీపీ అన్నదాత పోరు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వైసీపీ తలపెట్టిన అన్నదాత పోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ కోరారు. పోస్టర్‌ను ఆదివారం ప్రకాశం రోడ్డులోని పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఎరువుల కోసం రైతులు పడుతున్న ఇబ్బందులను తొలగించాలని కోరుతూ పోరు చేపట్టామన్నారు. రైతులందరికి సరిపడా ఎరువులు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. దేవీచౌక్ నుంచి ర్యాలీగా బయలుదేరి ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తామని చెప్పారు. పార్టీ నాయకులు దేసు శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, వెంకటప్పారెడ్డి, దుబాయ్‌బాబు, తాడిబోయిన రమేష్, హరీష్, ఎంపీపీ చెన్నకేశవులు పాల్గొన్నారు.

రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలి

● సీపీఐ జిల్లా కార్యదర్శి మాల్యాద్రి

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతులకు ఎరువులు సకాలంలో అందుబాటులో ఉంచేలా ప్రభుత్వం చూడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి డిమాండ్ చేశారు. పొన్నూరు పట్టణంలోని భారత కమ్యూనిస్టు పార్టీ కార్యాలయంలో ఆదివారం కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కార్యదర్శి మాల్యాద్రి మాట్లాడుతూ సీపీఐ, రైతు సంఘం, ఏఐకేఎస్ పిలుపుమేరకు ఈ నెల 8వ తేదీన అన్ని మండల కేంద్రాలలో నిరసన కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. రైతులకు ఎరువులు అందజేయాలని, బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నిరసన కార్యక్రమాలను అన్ని మండల కేంద్రాల వద్ద నిర్వహించాలని పార్టీ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్లో రైతులు యూరియా అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వం సకాలంలో రైతులకు యూరియా అందుబాటులో తీసుకువచ్చి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల కోసం చేపట్టిన ఈ ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ, పట్ట కార్యదర్శి ఆరేటి రామారావు, దేవరకొండ శ్రీనివాసరావు, సుగుణ, స్వప్నసుధా, సీపీఐ కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మాల్యాద్రి

ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పద్మశాలీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): డివిజన్‌లోని వివిధ మండలాల్లో పనిచేస్తూ అవార్డులు పొందిన ఉపాధ్యాయులను ఆదివారం సన్మానించారు. పద్మశాలీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులు మాచర్ల నాగేశ్వరరావు, ఆకురాతి హరిప్రసాద్, దివి ఉమాదేవి, మాచర్ల లీలాశ్రీనివాసమూర్తి, హరికాటి బాలసుబ్రహ్మణ్యంలను సన్మానించారు. సంఘ రాష్ట్ర అధ్యక్షులు జీవీఎస్ రామకృష్ణ మాట్లాడుతూ నైపుణ్యంతో విధులు నిర్వహించి అవార్డులు సాధించడం అభినందనీయమన్నారు. కేటీ ప్రసాద్, బాలచంద్రమౌళి, జి.సుబ్బారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కవి రహీం సాహెబ్‌కు జాషువా పురస్కారం



జాషువా పురస్కారం అందుకుంటున్న కవి రహీం సాహెబ్

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణానికి చెందిన కవి షేక్ రహీం సాహెబ్‌కు జాషువా పురస్కారం లభించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భాష సాంస్కృతిక శాఖ సౌజన్యంతో అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ ఉషోదయ ఫౌండేషన్ భీమవరంలో ఆదివారం జాతీయ కవి సమ్మేళన వేడుకలు నిర్వహించింది. ఈ సమ్మేళనంకు హాజరైన పొన్నూరు పట్టణానికి చెందిన ఆర్టీసీ కండక్టర్ కవి షేక్ రహీం సాహెబ్ చేసిన స్వీయ రచన మన కాలపు జాషువా అనే కవిత గానంతో సాహితీవేత్తల ప్రశంసలు అందుకున్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన కవులు సాహితీవేత్తలు రహీం సాహెబ్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఉషోదయ ఫౌండేషన్ సంస్థ సీఈవో యూవీ రత్నం రహీం సాహెబ్‌కు జాషువా పురస్కారం అందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కన్వీనర్ ఉషారాణి వీవీ సత్యనారాయణస్వామి తదితరులు పాల్గొని రహీం సాహెబ్‌ను అభినందించారు.

మధ్యంతర భృతిని తక్షణమే ప్రకటించాలి

● ఏఐఎస్టీఎఫ్ జాతీయ కార్యదర్శి సుధీర్ బాబు డిమాండ్

గుంటూరు (విద్య) సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతి చెల్లించాలని ఏఐఎస్టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసెఫ్ సుధీర్ బాబు డిమాండ్ చేశారు. కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో ఆదివారం జరిగిన ఎస్టీయూ ద్వితీయ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు డి.పెదబాబు అధ్యక్షత వహించారు. జోసెఫ్ సుధీర్ బాబు మాట్లాడుతూ 12వ వేతన సవరణ సంఘాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని, 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని, రిటైర్ అయిన వారికి గ్రాట్యుటీ, కమ్యూటేషన్, లీవ్ ఎన్ క్యాష్మెంట్ ఇతర బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు.



సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి

● ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

పెదకాకాని, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతూ కార్పొరేట్ స్థాయిలో వైద్యం పొందలేని బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 5 చెక్కులను 4,40,497 రూపాయల మొత్తాన్ని పెదకాకాని మండలంలోని లబ్ధిదారులకు ఆదివారం ఎమ్మెల్యే నరేంద్రకుమార్ అందజేశారు. పెదకాకాని గ్రామానికి చెందిన కేశని లక్ష్మికి 40,614, వరికుంట అక్షయకి రూ.1,09,660, కొప్పురావూరు గ్రామానికి చెందిన పరకండ్ల అంజలికి రూ.1,20,000, పెదకాకాని మండలం ఆగతావరప్పాడుకు చెందిన మల్లంపల్లి శ్రీనివాసరెడ్డికి రూ.74,863, నంబూరు గ్రామానికి కొండా మణికి రూ.25,655 చెక్కులను బాధితులకు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అందజేశారు. కార్యక్రమంలో కొప్పురావూరు ఉప సర్పంచ్ విన్నకోట పూర్ణశంకర్రావు, మండల పార్టీ అధ్యక్షుడు వలివేటి మురళి, ప్రధాన కార్యదర్శి తాళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



రైల్వేస్టేషన్ సెంటర్‌లో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం

తెనాలి అర్బన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో అన్ని వస్తువుల ధరలకు సామాన్యులకు అందుబాటులో వస్తున్నాయని బీజేపీ జిల్లా నాయకుడు పొట్టి మూర్తి శ్రీనివాస్ చెప్పారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం రైల్వేస్టేషన్ సెంటర్‌లో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ, ఎన్నో వస్తువుల ధరలు వేల రూపాయలు తగ్గిపోవడం వలన మధ్య తరగతి ప్రజలు సైతం కొనుగోలు చేసే శక్తి పెరుగుతుందన్నారు. ఇతర దేశాల వస్తువులను కొనకుండా దేశీయ కంపెనీలను ఆదరించి ట్యాక్స్‌లతో భయపెట్టాలని చూస్తున్న అగ్రదేశం అమెరికాకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఇతర దేశాలకు చెందిన ఏ కంపెనీ కూడా కష్టకాలంలో ప్రజల కోసం రూపాయి ఇచ్చిందిలేదని, మన దేశం కంపెనీలే వేల కోట్ల విరాళాలు ఇచ్చిన విషయం గుర్తుంచుకోవాలన్నారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణానికి వేలకోట్లు కేటాయించారని, రాజధానికి సమీపంలో ఉండే అన్ని జిల్లాల ప్రజల వైద్యానికి ఎయిమ్స్ నిర్మించారని చెప్పారు. మైలా హరికృష్ణ, వాసుదేవనాయుడు, సందీప్‌రాజు, సంపత్‌రాయుడు, కనకదుర్గ, చంద్ర, రాజు, ఫణికృష్ణ పాల్గొన్నారు.

స్వయం భూ కవి సుబ్బారావు

● అమరావతి సాహితీ మిత్రులు సంస్థ అధ్యక్షుడు డాక్టర్ రావి రంగారావు

గుంటూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్వయం భూ కవి చిటిప్రోలు సుబ్బారావు అని అమరావతి సాహితీ మిత్రులు సంస్థ అధ్యక్షుడు డాక్టర్ రావి రంగారావు తెలిపారు. బ్రాడీపేట సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ సమావేశ మందిరంలో ఆదివారం 'అమరావతి సాహితీ మిత్రులు' నిర్వహించిన చిటిప్రోలు సుబ్బారావు వెన్నెల గింజలు కవిత్వ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. వ్యాపార రంగంలో పలు సేవలందించి పదవీ విరమణ తరువాత నిద్రాణమై ఉన్న కవిత్వ శక్తిని మేలుకొలుపుకుంటూ సహజ కవిగా అద్భుతమైన భావనల్ని 'వెన్నెల గింజలు' పేరుతో పుస్తకం ప్రచురించటం అభినందనీయం అన్నారు. 'వెన్నెల గింజలు' కవిత్వ సంపుటిని రావి రంగారావు, డాక్టర్ టీ సేవకుమార్, డాక్టర్ గుమ్మా సాంబశివరావు, నాగరాజ్యలక్ష్మి, సిహెచ్ వెంకటరత్నం, సాహితీవేత్త డాక్టర్ బీరం సుందరరావు ఆవిష్కరించారు. సభలో కవి చిటిప్రోలు సుబ్బారావును రావి రంగారావు, సేవకుమార్ మొదలైన వారు ఘనంగా సత్కరించారు.



చాతుర్మాస్య మహావ్రత కార్యక్రమంలో పాల్గొన్న సాధువులు

అర్ధ చాతుర్మాస్య మహావ్రతాలు ప్రారంభం

తెనాలి అర్బన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తెనాలిలో ఆదివారం అర్ధ చాతుర్మాస్య మహావ్రతాలను సాధుపరిషత్ గౌరవ అధ్యక్షుడు వాసుదేవానంద గిరిస్వామి ప్రారంభించారు. గాంధీనగర్‌లో అఖిలాంధ్ర సాధుపరిషత్ ఆధ్వర్యంలో చేపట్టిన వ్రతాలు నవంబరు 5వరకు కొనసాగుతాయి. భగవద్గీత, ఉపనిషత్తులు, వివేకచూడామణి వంటి గ్రంథాల నుంచి మహాత్ములు అందించే జ్ఞానామృతాన్ని ఆలకించాలని ఆయన కోరారు. లోక కల్యాణం కోసం నిర్వహిస్తున్న వ్రతాలలో పరమాత్మానంద గిరిస్వామి, కృష్ణచరణానంద భారతీస్వామి, స్కంద దేవానంద గిరిస్వామి, సత్యానంద గిరిస్వామి అనుగ్రహ భాషణం చేస్తారు. నిత్యగోత్ర నామార్చన, అన్నదానం నిర్వహిస్తారు. వ్రతాలలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కోరారు.



సమావేశంలో పాల్గొన్న ప్రజానాట్యమండలి ప్రతినిధులు

నేటి నుంచి కళాకారుల సంస్మరణ సభలు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): దివంగత కళాకారుల సంస్మరణ సభలు సోమవారం నుంచి 19వ తేదీ వరకు నిర్వహిస్తామని ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు బొల్లిముంత కృష్ణ తెలిపారు. గాంధీనగర్‌లోని ఇస్కఫ్ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ, ఎంతోమంది కళాకారులు సమాజానికి కళాసేవ చేశారని చెప్పారు. కళాకారులు రాజారావు, వాసిరెడ్డి, చిరంజీవి, మోహన్‌దాస్, చలపతిరావు, నాగభూషణం, పెరుమాళ్లు, సరోజిని, రాజమ్మ, సౌమిత్రి, ఆత్రేయ, గోపాలరావు, కృష్ణమూర్తి, సీతారామయ్య, మోహనరావు, సంపత్‌కుమార్, తాపీ ధర్మారావులకు నివాళులర్పించే సభల్లో కళాభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. నాగమణి, శివకుమారి, విజయసారథి పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన గణపతి ఉత్సవాలు



ఊరేగింపుగా తీసుకువెళుతున్న వినాయక విగ్రహం

చేబ్రోలు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చవితి సందర్భంగా చేబ్రోలు మండలంలో పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక పందిర్లలో ఆదివారం ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. మండలంలోని వివిధ గ్రామాలలో 82 విగ్రహాలను ఏర్పాటు చేసి ఘనంగా పూజలు నిర్వహించారు. 3,7,9వ రోజుల్లో పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం కొన్ని విగ్రహాలను చేబ్రోలు కొమ్మమూరు కాలువలోనూ మరికొన్ని గరువుపాలెం వద్ద నిమజ్జనాలు చేశారు. ఈ సందర్భంగా శుద్ధపల్లి పాఠశాల వద్ద ఎస్ఎస్ఆర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పందిర్లలో 81 కేజీల లడ్డూను లక్ష ఐదువేల రూపాయలకు చెన్నం శెట్టి శ్రీనివాసరావు సొంతం చేసుకోగా 25కేజీల లడ్డూను మట్టుపల్లి కోటేశ్వరావు 58వేలకు సొంతం చేసుకున్నారు. ఈ నగదులో కొంతభాగాన్ని స్థానిక పాఠశాలలో జరుగుతున్న అదనపు గదుల నిర్మాణానికి అందజేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. చేబ్రోలులోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో హైస్కూల్ బజార్లో సుద్ధపల్లి బీఎస్సార్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విగ్రహాలను ఆదివారం సాయంత్రం కనకతప్పెట్ల మధ్య బాణసంచా కాల్పులతో ఘనంగా నిమజ్జనం చేశారు.